VISALAANDHRA, VIJAYAWADA—Phone No. 776

రిజిస్టర్డు నెం. 6097. 4 పేజీలు : ఒక్క అణా

భారత ప్రధాని నెహ్రూకు కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయ బిరుదు ప్రదానం

కేంబ్రిడ్జి, మే 23

భారత ప్రధాన మంత్రి నెహ్రూకు "డాక్టర్ ఆఫ్ లా" అనే గౌరవ బిరుదును యివ్వాలన్న ప్రతిపాదనను ఈవేళ కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయ అధికారులు [illegible].

శ్రీ నెహ్రూ 1907 లో కేంబ్రిడ్జిలో విద్యాభ్యసించారు.

బ్రిటిష్ రాణి పట్టాభిషేకోత్సవ సందర్భంలో లండను వచ్చినప్పుడు శ్రీ నెహ్రూ ఈ బిరుదును స్వీకరిస్తారు.

విశాలాంధ్ర

705308

సంపుటి 2 ★ విజయవాడ : సోమవారం; మే 25, 1953 ★ సంచిక 68

[illegible]

మాస్కో, మే 24

[illegible]

ఇండియా - పాకిస్తాన్ ప్రధాన మంత్రుల సమావేశం

లండన్‌లో జరుగుతుందని ఢిల్లీ కరాచీలనుండి సంయుక్త ప్రకటన

అగ్రరాజ్య సమావేశం

మాలొటావ్‌తో బ్రిటిష్ ప్రముఖుని చర్చ

మాస్కో, మే 22

బ్రిటిష్ ప్రభుత్వపు వాణిజ్యశాఖ మాజీ అధ్యక్షుడయిన హెరాల్డ్ విల్సన్ నతరాత్రి సోవియట్ విదేశాంగమంత్రిని కలుసుకొని, అగ్రరాజ్య సమావేశం విషయమై చర్చిల్ చేసిన సూచనను గురించి చర్చించాడు.

ఈ సంభాషణలు ఒక గంటసేపు సాగాయి. మాస్కోలోని బ్రిటిష్ రాయబారి గాస్కోయిన్ కూడా హాజరయ్యాడు. కాని సంభాషణలలో పాల్గొనలేదు.

ఆ సూచనపై సోవియట్ ప్రభుత్వపు అభిప్రాయం త్వరలోనే వెల్లడి కాగలదని ఆశిస్తున్నానని విల్సన్ అన్నాడు.

చర్చిల్ సూచనను గురించి విన్న తరువాత, "శ్రద్ధగా ఆలోచించవలసిన విషయం" అని మాత్రం చెప్పి మాలొటావ్ ఊరుకున్నాడట.

ప్రజాసభ సమావేశం

ఆగస్టు 3 నుండి సెప్టెంబరు 11 వరకూ

న్యూఢిల్లీ, మే 23

ఆగస్టు మూడో తేదీన సమావేశం గాబోతున్న ప్రజాసభ సెప్టెంబరు 11 వ తేదీ వరకూ జరపడానికి నిర్ణయించబడింది. అంటే 30 రోజులు సమావేశం ఉంటుంది. ఈసారి యిదివరకటి కంటే అనధికార సభ్యులు తమ బిల్లులను, తీర్మానాలను ప్రతిపాదించడానికి ఎక్కువ అవకాశం ఉంటుంది. ప్రతి శుక్రవారం అనధికార రోజుగా నిర్ణయించబడింది. శుక్రవారం సెలవు రోజు అయిన పక్షంలో ఆ మరునాడు అనధికార రోజుగా పరిగణించబడుతుంది.

ఈ సమావేశాలు ఉదయం 8-15 నుండి 1-15 వరకూ ఉంటాయి.

న్యూఢిల్లీ, మే 23

ఇండియా, పాకిస్తాన్‌ల మధ్యగల విభేదాలన్నింటినీ పరిష్కరించుకొనే ఉద్దేశ్యంతో భారత - పాకిస్తాన్ ప్రధాన మంత్రులు సమావేశం కాబోతున్నారని ఈ వేళ ఢిల్లీ - కరాచీల నుండి ఒకేసారి ఒక సంయుక్త ప్రకటన వెలువడింది.

ఉభయదేశాల ప్రధానులు ప్రాథమిక చర్చలకోసం వచ్చేనెల ప్రారంభంలో లండన్‌లో సమావేశమవుతారు. ఆతరువాత వారు తమ తమ దేశాలకు తిరిగివచ్చిన తరువాత 'సాధ్యమైనంత త్వరలో', సమావేశమై అన్ని సమస్యలు వివరంగా చర్చించుతారు.

ఈలోపున ఇండియా - పాకిస్తాన్ ప్రభుత్వాలు తమ మంత్రులకు ఉభయ దేశాలమధ్యగల ప్రధాన సమస్యలను గురించి సంప్రతింపులను ప్రారంభించవలసిందిగా ఆదేశించాయి. ఈ సంప్రతింపుల వివరాలను గురించి తమతమ ప్రధాన మంత్రులకు ఎప్పటికప్పుడు తెలియజేయవలసిందిగా కూడా ఆదేశించబడింది.

అంతేకాకుండా ఉభయప్రభుత్వాలచే అధికారులతో కూడిన ఒక సారధ్య కమిటీని ఏర్పాటుచేయడానికి కూడా నిర్ణయించబడింది.

విదేశాంగ మంత్రివర్గ కార్యాలయం నుండి వెలువడిన ప్రకటనలో ఈ క్రింది అంశాలున్నాయి :

వచ్చేనెల ఆరంభంలో లండన్‌లో ఇండియా - పాకిస్తాన్ ప్రధాన మంత్రులు సమావేశమవడానికి అంగీకరించబడింది. వారు కాశ్మీర్, మైనారిటీల సమస్యపై ప్రధాన మంత్రుల ఒడంబడిక అమలుపరచబడుతున్న విధానం, కాందిశీకుల ఆస్తి సమస్య, యింకా ఇండియా-పాకిస్తాన్‌లకు సంబంధించిన తదితర సమస్యలపై ప్రాథమిక చర్చలను జరుపుతారు. ఇతర కార్యక్రమాలుండడం వలన వీటన్నింటిపై ఉభయ ప్రధానులూ లండన్‌లో వివరంగా చర్చించేందుకు అవకాశం ఉండదు. తమ తమ దేశాలకు తిరిగివచ్చిన తరువాత సాధ్యమైనంత త్వరలో అన్ని సమస్యలపై వివరంగా చర్చలు ప్రారంభిస్తారు.

ఉభయదేశాల ప్రభుత్వాల అధికారులతో నియమించబడిన సాధారణ కమిటీ పాకిస్తాన్ ప్రధానమంత్రి లండనులో కామన్‌వెల్తు ప్రధానుల సమావేశాన్నుండి తిరిగి రాగానే కరాచీలో మొట్టమొదటి సారిగా సమావేశమవుతుంది.

ప్రభుత్వ ఉద్యోగుల బాధ్యతలు

దేశవ్యవహారాల ఉపమంత్రి వివరణ

న్యూఢిల్లీ, మే 23

తాము జాతియొక్క ధర్మకర్తలమన్న భావంతో ప్రభుత్వ ఉద్యోగులు పనిచేయాలని ఈవేళ దేశ వ్యవహారాల ఉపమంత్రి శ్రీ బి. యన్. దాతార్ ఉద్బోధించారు.

అయిదు వారాలపాటు జరిగిన సెక్రెటేరియట్ ట్రైనింగ్ స్కూలులోని విద్యార్థుల, ఉపాధ్యాయుల సమావేశంలో శ్రీ దాతార్ ప్రసంగిస్తూ యింకా యిలా అన్నారు :

ప్రభుత్వ ఉద్యోగులు తమపైగల బాధ్యతలను గుర్తెరగాలి. ముఖ్యంగా పేద ప్రజల యెడ తమ కర్తవ్యాన్ని నిర్వర్తించాలి. మీరు సేవా దృష్టితో సమర్థతతో పని చేస్తే యావత్తు పరిపాలనా యంత్రాన్ని మరింత శక్తివంతం చేయవచ్చు. మంత్రులు మీరిచ్చే సలహాలపై ఆధారపడి సాధారణంగా పనిచేస్తారు. అందువలన మీరుచేసే పనికి చాల ప్రాముఖ్యత ఉంది. ప్రభుత్వ ఉద్యోగులలో వినయత, క్రమశిక్షణ చాల అవసరం.

సోవియట్ కార్మికుల పనిగంటలు

5 గంటలకు తగ్గించబడతాయని గోపాలన్ వివరణ

ఎర్నాకులం, మే 23

సోవియట్ యూనియన్‌లో ప్రస్తుతం అమలు జరుగుతున్న పంచవర్ష ప్రణాళిక పూర్తి అయినప్పుడు, ప్రపంచ ఆహార అవసరాలలో నాలుగింట మూడు వంతులను సోవియట్ తీర్చగలదని, సోవియట్ కార్మికుల పనిగంటలు ప్రస్తుతం 8 గంటలనుండి 5 గంటలకు తగ్గించబడుతాయని కమ్యూనిస్టుపార్టీ నాయకుడు శ్రీ ఏ. కె. గోపాలన్ నేడిక్కడ పత్రికా విలేఖరుల గోష్ఠిలో తెలిపారు.

సోవియట్‌లో నిర్మాణంలో వున్న ప్రాజెక్టులను ప్రస్తావిస్తూ సైబీరియాలో ఒక నది ప్రవహించే మార్గాన్ని మార్చి ఆమూదరియా నదిలో దానిని కలుపుతారని, ఇందుమూలంగా 2 లక్షల ఎకరాల ప్రాంతం సాగవుతుందని గోపాలన్ అన్నారు. పంచవర్ష ప్రణాళిక క్రింద మరి 50 ప్రాజెక్టులుకూడా ప్రారంభించబడ్డాయన్నారు.

సోవియట్ యూనియన్‌పై అభిప్రాయాలను వివరిస్తూ, అక్కడ శాంతియుత వాతావరణం వున్నదని యుద్ధోన్మాదం లేదని అక్కడికి వెళ్ళిన అతితీవ్ర కమ్యూనిస్టు వ్యతిరేకికూడా అంగీకరిస్తాడని అన్నారు. సోవియట్ శాంతి విధానంపట్ల ఎట్టి సందేహాలు ఉండనవసరం లేదన్నారు.

ఆంధ్రజాతి ఐక్యతను కాపాడేందుకు నడిగడ్డలో రాజధాని

రాయలసీమ ప్రాంతాన్నుండి పలువురు ప్రముఖుల ప్రకటన

అనంతపురంలో హైకోర్టు సముచితమని సూచన

విజయవాడ, మే 24

ఆంధ్ర రాజధాని విజయవాడలోను, హైకోర్టు అనంతపురంలోను నెలకొల్పాలనీ, జూన్ ఒకటవ తేదీన ఆంధ్ర శాసన సభ్యులు యీ విధంగా నిర్ణయం చేయాలనీ కోరుతూ రాయలసీమ జిల్లాలలో ప్రజానీకం సభలు, సమావేశాలు జరిపి తీర్మానించుతున్నారు. కాంగ్రెసు వాదులతో సహా పలువురు రాయలసీమ నాయకులు యిదేవిధంగా సూచిస్తూ ప్రకటలు చేస్తున్నారు.

కర్నూలునుండి శ్రీ పైలవరపు వెంకట రామయ్యగారు ఒక ప్రకటన చేస్తూ విజయవాడలో రాజధాని, అనంతపురంలో హైకోర్టు నెలకొల్పాలని కోరారు.

ఆ ప్రకటనలో వారిలా వ్రాస్తున్నారు:

"రాబోవు జూన్ 1 వ తేదీ ఆంధ్రదేశ చరిత్రలో [illegible] ముఖ్యమైనది. ఆనాడు మన ఆంధ్రశాసన సభ్యులు ఆంధ్ర రాజధానిని, హైకోర్టు స్థానము నిర్ణయింపనున్నారు.

ఈ నిర్ణయమునకు సహాయకారిగానో లేక ఈవిషయమున పానకములోపుడకగానో, శ్రీబాగ్ ఒడంబడిక అనేది ఒకటి ఉన్నది.

మొత్తము ఆంధ్రదేశ శ్రేయస్సును పాటింపక, కోస్తాజిల్లాలనీ, రాయలసీమయనీ, ఒక కృత్రిమ విభాగమును ఆశ్రయించి ఆంధ్రశ్రీలో "మాకెంత, మీకెంత" అని దాయభాగపద్ధతిని పెద్ద పెద్దలే పాటుపడుట మిక్కిలి శోచనీయముగాదా !

తిరుపతి పనికిరాదు

రెండు పక్షములవారు, వారి వారి ఆశయములలో కొంతకొంతయునా సడలింపక, మా పక్షమే శతమునకు శతము న్యాయమయునని పట్టుపట్టుట శ్రేయోదాయకము కాదు. కాబట్టి, రెండు పక్షములకు మధ్యేమార్గము అవసరము. రాజధానియు, హైకోర్టున్నూ ఒక్కచోట నుండుట యెంత ఉత్కృష్ట మార్గమైనను, దేశ వైశాల్యమును బట్టి కొందరి వాంఛలను [illegible] వేరు వేరు చోట్ల పెట్టవలసివచ్చును. ఈ [illegible] నగరము లేని పశ్చిమాంధ్ర ప్రాంతము ఈ ఉత్తమ నగరమైన విజయవాడను రాజధానిగా నిర్ణయించుటలో సహకరింపవలయును. రాయలసీమవాసుల్లో, శ్రీబాగ్ ఒడంబడిక కారకులైనవారిలో ఒకరగు శ్రీ పప్పూరి రామాచార్యులవారు మొదలైనవారు సూచించినరీతి, విజయవాడ రాజధానిగాను, అనంతపురము హైకోర్టు స్థానముగాను నిర్ణయించుట రాజీపద్ధతి, సమంజస్యమైనమార్గము. కాబట్టి మన శాసనసభ్యులు ఈమధ్యే మార్గమును అవలంబించి, ప్రస్తుతాంధ్రులయొక్క, భవిష్యదాంధ్రుల యొక్కయు కృతజ్ఞతకు పాత్రులగుదురుగాక! మూల మూలలలోనున్న విశాఖపట్నమునుగాని, మనము తాత్కాలికముగానైన వుపయోగించు కొనుటకు వీలులేదన్న మదరాసుకే వుపకరించునట్లు దానికి సన్నిహితమైన తిరుపతినిగాని మనశాసనసభ్యులు రాజధానిగా వరింప కుందురుగాక!"

మంత్రి శ్రీ నాయకంటి శంకరరెడ్డిగారు పార్లమెంటు ఉపఎన్నిక ప్రచార సందర్భంలో ఈనెల 18 వ తేదీన తమ నియోజక వర్గమైన పత్తికొండ (కర్నూలు) తాలూకాలో పర్యటిస్తూ గోనెగండ్లను విచ్చేశారు. జిల్లా యువజన నాయకుడు శ్రీ జి. కె. హనుమంతరావుగారు మంత్రికి ఒక మెమొరాండం సమర్పిస్తూ, ఆంధ్ర ప్రజానీకం [illegible], విజయవాడ-గుంటూరులమధ్య రాజధాని నెలకొల్పాలని కోరారు.

సమిష్టి సౌకర్యం దృష్ట్యా నిర్ణయం

చిత్తూరునుండి విద్వాన్ శ్రీనరమూర్తిగారు యిలా వ్రాస్తున్నారు.

"చారిత్రకంగా సుప్రసిద్ధమై, ఆంధ్రులందరికి సమీపంలో వుండి, అన్ని సౌకర్యాలతో తులతూగుతున్న విజయవాడే ఆంధ్ర రాజధానికి తగిన పట్టణం. ఈ విజయ సంవత్సరంలో విజయవాడనే ఆంధ్ర రాజధానిగా యేర్పాటు చేయడం ముదావహం. శ్రీబాగ్ ఒడంబడిక ప్రకారం, రాయలసీమలోని అనంతపురంలో ఆంధ్ర హైకోర్టు నెలకొల్పడం సమంజసం. ఈ విధమైన ఏర్పాటువల్ల ఆంధ్రులకు సమిష్టి సౌకర్యం ఏర్పడగలదు."

అనంతపురం యువజన నాయకుని విజ్ఞప్తి

అనంతపురం పట్టణ యువజన సంఘ అధ్యక్షులు శ్రీ ఎ. కోదండ రామయ్యగారు యిలా వ్రాస్తున్నారు :

"ఆంధ్ర దేశానికంతకీ కేంద్రము, రైలు మార్గాల కూడలిస్థలము, రేడియో ప్రసార కేంద్రము, విమానాశ్రయము మొదలైన సౌకర్యాలన్నీ వున్న విజయవాడ ఆంధ్ర రాజధానికి తగిన పట్టణం. ఇంత నీటి వసతిగల పట్టణం ఆంధ్రలో మరొకటి కనిపించదు. ఇటువంటి పట్టణమే వ్యాంధ్ర రాజధానికి తగినది. ముఖ్యంగా ఇటు రాయలసీమ వారులకు, అటు విశాఖజిల్లా ప్రజలకు అందుబాటులోవున్నది. సమశీతోష్ణపరిస్థితులు, జనాభా పెరుగుదలను భరించేటటు వంటి విశాలస్థలమూ, ఇంతవరకు విద్యా కేంద్రముగా వున్నటువంటి అనంతపురంలో ఆంధ్ర హైకోర్టు నెలకొల్పిన శ్రీబాగ్ ఒడంబడికను అమలు జరిపినట్లు కాగలదు. ఇది రాయలసీమ ప్రజలలో ఎక్కువమంది అభిమతం. రాజధానీ నిర్ణయం జరిపేముందు ఈ విషయాలన్నీ ఆంధ్రదేశంలోని శాసన సభ్యులందరు ఎక్కువ శ్రద్ధతో గమనించి, విజయవాడ ప్రాంతంలో ఆంధ్ర రాజధాని, అనంతపురంలో హైకోర్టు నెలకొల్పే ఏర్పాటు చేయుమని నిర్ణయించగలరని ఆశించుచున్నాను."

ఆంధ్రరాష్ట్ర వెనుకబడిన జాతుల సంఘాల అధ్యక్ష కార్యదర్శుల తదితర కార్యకర్తల సమావేశం యీనెల 20 వ తేదీన పెద కాకానిలో జరిగింది. సమావేశానికి ఆంధ్రరాష్ట్ర రజకలేబరు యూనియన్ ప్రెసిడెంటు డాక్టరు క. వి. రావుగారు అధ్యక్షత వహించారు.

విజయవాడనే ఆంధ్రరాష్ట్ర రాజధానిగా నిర్ణయించాలని అన్ని రాజకీయ పక్షాలకు చెందిన శాసనసభ్యులను ఒక తీర్మానంలో కోరారు.

ప్రజామోదంపొందే పట్టణం

[illegible] కాంగ్రెసు కార్యవర్గ సభ్యుడు శ్రీ పద్మనాభుని వెంకటేశ్వరరావుగారు ఒక ప్రకటనలో ఇలా అన్నారు :

"ఆంధ్ర రాజధానికి కావలసిన లక్షణములు సంపూర్ణముగా విజయవాడకు కలవు. గుంటూరు, ఏలూరు, బందరు, తెనాలి, క్రమక్రమంగా విజయవాడలో కలిసిపోయి, ఒకమహానగరంగా ఏర్పడు అవకాశము కలదు. విజయవాడలో ఆంధ్ర రాజధాని నెలకొల్పుట అన్ని ప్రాంతముల వారికిని కేంద్రముగా నుండి ఆమోదకరముగా నుండగలదు. ఆంధ్ర శాసన సభ్యులందరునూ తమ పార్టీ విభేదములను విస్మరించి ఏకగ్రీవముగా విజయవాడ పట్టణమునే ఆంధ్ర

(మిగతా 4 వ పేజీలో)

లండన్‌లో ప్రధాని నెహ్రూకు తీరని కార్యక్రమం

లండన్, మే 23

బ్రిటిషు రాణి పట్టాభిషేకోత్సవ సందర్భంలో భారత ప్రధాని నెహ్రూ లండన్‌లో వుండే 19 రోజులలో ఆయనకు తీరని కార్యక్రమం ఏర్పాటు చేయబడింది.

జూన్ తొమ్మిదవ తేదీన శ్రీ నెహ్రూ కేంబ్రిడ్జ్ కార్యక్రమంలో పాల్గొంటారు. అదేరోజు సాయంత్రం బ్రిటిషు ప్రధాని చర్చిల్ తన గౌరవార్థం ఏర్పాటుచేసిన విందులో పాల్గొంటారు.

జూన్ 10 వ తేదీన లండన్‌లో భారత హైకమీషనర్ కార్యాలయంలో రాయబారుల సమ్మేళనంలో పాల్గొంటారు.

జూన్ 11 వ తేదీన శ్రీ నెహ్రూ బ్రిటిష్ వైమానిక సైనికుల వందనం స్వీకరిస్తారు. అదే రోజున విదేశ పత్రికా ప్రతినిధులు ఆయనకు విందు చేస్తారు.

12 వ తేదీన లండన్ మేయర్ కామన్‌వెల్తు ప్రధానులకు విందు చేస్తారు. అందులో నెహ్రూ పాల్గొంటారు.

ఇలాగే ప్రతి రోజు వరుసగా తీరని కార్యక్రమం ఏర్పాటు చేయబడింది.

ఇండియా విదేశాంగ మంత్రివర్గ ప్రధాన కార్యదర్శి శ్రీ యన్. ఆర్. పిళ్ళై నతరాత్రి లండన్ జేరుకొన్నారు.

దేశవ్యాపిత సమ్మెకు ఫ్రెంచి రైల్వే కార్మికుల నిర్ణయం

సమ్మెను భగ్నంచేయ ప్రభుత్వ పన్నాగాలు

పారిస్, మే 23

బుధవారంనాడు 24 గంటలసేపు దేశవ్యాపిత సమ్మె జరిపేందుకు ఫ్రెంచి రైల్వే కార్మికులు ఇటీవల నిశ్చయించారు. దేశంలోకెల్లా ప్రధాన కార్మిక సంస్థ అయిన "జనరల్ కాన్ఫెడరేషన్ ఆఫ్ లేబర్" కాథలిక్కు ఇండిపెండెంటు ట్రేడ్‌యూనియన్లన్నీ ఈసమ్మె నిర్ణయాన్ని బలపరిచాయి.

బుధవారంనాడు ఒక గంటసేపు ఎక్కడి రైళ్ళు అక్కడ ఆపివేయడానికి ట్యునీషియా రైల్వే కార్మికులు నిశ్చయించారు.

అల్జీరియాలో కూడా రైల్వే కార్మికులు 24 గంటలసేపు దేశ వ్యాపిత సమ్మె జరిపేందుకు నిర్ణయించారు.

జీవన వ్యయం విపరీతంగా పెరిగిపోయింది కాబట్టి, తమ జీతాలను పెంచాలన్న తమ కోర్కెను సాధించుకునేందుకే కార్మికులు ఈ సమ్మెను నిశ్చయించారు.

సమ్మెను విచ్ఛిన్నంచేసేందుకు ప్రభుత్వ యత్నం

ఈసమ్మె జరక్కుండా చేయడానికి రవాణాశాఖా మంత్రి, జీతాల విషయమై ఒక సూచన చేశాడని కొన్ని ట్రేడ్ యూనియన్లు దానికి అంగీకరించాయి కాబట్టి సమ్మెలు జరక్కపోవచ్చునని ఒక వార్త. కాని ప్రధానమైన "జనరల్ కాన్ఫెడరేషన్ ఆఫ్ లేబరు" ఈ జీతాల సూచన విషయమై తన అభిప్రాయాన్ని ఇంకా తెలుపలేదని ఆవార్త వెల్లడి చేస్తూంది.

ఫ్రాన్సులో జీవనవ్యయానికీ, జీతాల స్థాయికిగల వ్యత్యాసాన్ని నిరసిస్తూ ఈ కొద్దిరోజుల్లోనే వస్త్ర కార్మికులు, రెనో మోటారు ఫ్యాక్టరీ కార్మికులు గ్యాస్, ఎలక్ట్రిసిటీ కార్మికులు, పారిస్ రవాణా కార్మికులు సమ్మెలు సాగించారు;

దక్షిణ ఫ్రాన్సులో పెద్దఎత్తున రైల్వే సమ్మె

దేశమంతటా బుధవారంనాడు రైల్వే సమ్మె ప్రారంభించాలని నిర్ణయం జరిగినా, దక్షిణ ఫ్రాన్సు రైలు మార్గాలలో సమ్మె నిన్ననే ప్రారంభమయింది. దీని ఫలితంగా వారాంతం సెలవుల్లో వినోదాలకు వెళ్లేవారంతా ఆగిపోవలసి వచ్చింది. దక్షిణానికి పోయే అనేక రైళ్లు ఆగిపోయాయి.

రెండేళ్లలో ఇంత పెద్దసమ్మె జరగలేదట.

కార్మిక సంస్థలన్నీ ఏకగ్రీవంగా చేసుకున్న సమ్మె నిర్ణయాన్ని తలక్రిందులు చేయడానికి తలపెట్టబడిన [illegible] ఈ దక్షిణాది రైల్వే సమ్మె అని కాథలిక్కు ట్రేడ్‌యూనియన్ వారి వ్యాఖ్య.

రోజంబర్గు దంపతుల ప్రాణదానానికి బేరం

★

అమెరికా పాలకవర్గాల నీచ ప్రవృత్తి

వాషింగ్టన్, మే 23

దేశద్రోహ నేరం ఆరోపించబడి మరణశిక్ష విధించబడిన రోజంబర్గ దంపతులకు ప్రాణభిక్ష పెట్టేందుకు అమెరికా ప్రభుత్వం ఒక షరతుమీద అంగీకరించవచ్చునని న్యాయశాఖవర్గాలు నేడు తెలిపారు.

ఇంతవరకు బయట పడకుండా ఉన్న అమెరికా వ్యతిరేక కుట్రలను గురించి వారేమైనా భోగట్టా చెప్పగలుగుతే, ప్రభుత్వం వారిపై మరణశిక్షను రద్దు చేయవచ్చునని వీరన్నారు.

అమెరికా సుప్రీంకోర్టుకి రోజంబర్గు దంపతులు దాఖలు చేసుకున్న మూడవ అప్పీలు ఇంకా విచారణక్రింద ఉంది.

వీరు నిరపరాధులని, వారిపై మరణశిక్షను రద్దుచేసి, వారిని నిర్దోషులుగా విడిచిపెట్టాలని ప్రపంచంలో అన్ని దేశాల్లోనూ తీవ్రమైన ఆందోళన సాగింది.

కృష్ణమీనన్ కేంద్ర మంత్రివర్గంలోకి

తీసుకునే సూచన

న్యూఢిల్లీ, మే 23

ప్రధాని నెహ్రూ బ్రిటిషురాణి పట్టాభిషేకోత్సవానికి లండన్ వెళ్ళి తిరిగివచ్చిన తరువాత మంత్రివర్గంలో ముఖ్యమైన కొన్ని మార్పులు చేస్తారని ఇక్కడ అభిజ్ఞవర్గాల్లో భావించబడుతోంది.

స్టేట్స్ కౌన్సిల్ సభ్యుడుగా ఎన్నుకోబడటం చేత శ్రీ వి. కె. కృష్ణమీనన్ మంత్రివర్గ సభ్యుడుగా తీసుకోబడటం తథ్యం అని తెలుస్తోంది.

లండన్‌లో హైకమిషనర్ పదవికి ఆయన రాజీనామా యిచ్చినప్పుడే శ్రీ మీనన్‌కు మంత్రిపదవి యివ్వడానికి శ్రీ నెహ్రూ సిద్ధపడ్డారు.

అయితే అప్పుడు లండన్‌లోని ఇండియా కార్యాలయంద్వారా స్టోర్సు కొనడం ఆ కొనడంలో కుంభకోణం జరిగింది. అలాంటి పరిస్థితులలో తనను మంత్రిగా చేర్చుకొంటే నెహ్రూపై విమర్శ వస్తుందనే ఉద్దేశ్యంతో శ్రీ మీనన్ మంత్రివర్గంలో చేర నిరాకరించారు.

పాకిస్తాన్‌లో డల్లెస్ గూడుపుఠాణీ

ప్రాదేశిక మిలిటరీ రక్షణగురించి చర్చలు: మంత్రివర్గ కార్యదర్శులతో మంతనాలు

కరాచీ, మే 23

అమెరికా విదేశాంగమంత్రి డల్లెస్ ఈవేళ పాకిస్తాన్ ప్రధాని మహమ్మదాలీతోనూ, విదేశాంగమంత్రి జఫ్రుల్లాఖాన్‌తోనూ, ఆర్థికమంత్రి, సర్వసేనాధిపతి జనరల్ అయ్యూబ్‌ఖాన్‌తోనూ సంప్రతింపులు జరిపాడు.

ఈ సంప్రతింపులు చాల సంతృప్తికరంగా జరిగాయని మహమ్మదాలీ సంతోషాన్ని వెలిబుచ్చాడు.

"ప్రాంతీయ మిలిటరీ భద్రత, పాకిస్తాన్ ఆహారసమస్య మొదలైన అనేక విషయాలను గురించి నేనూ, డల్లెస్ చర్చించాము"ని ఆయన అన్నాడు. రేపుకూడా ఈ చర్చలు సాగుతాయన్నాడు.

కార్యదర్శులతోకూడా ముచ్చటిస్తారట

వివిధ మంత్రివర్గాల కార్యదర్శులతో కూడా తానూ, డల్లెస్ రేపు చర్చలు జరుపనున్నామని హెరాల్డు స్టాసెన్ పత్రికా విలేఖరులకు తెలియజేశాడు.

ఈ కార్యదర్శులతో ఏయే విషయాలు చర్చించదలచారో, తెలిపేందుకు పూర్తిగా నిరాకరించాడు.

జిన్నా, లియాకతాలీ సమాధులపై డల్లెస్, స్టాసెన్‌లు ఈవేళ పూలమాలలు వేశారు.

విలేఖరులకు హుకుం

'నోరెత్తి ప్రశ్నించకూడదు'

రేపు డల్లెస్ పత్రికా విలేఖరుల సమావేశం జరుపుతాడు. కాని, ఆయనను ప్రశ్నలడగదలచిన విలేఖరులు ఈవేళ మధ్యాహ్నానికే ప్రశ్నలు రాసి పంపాలని పాకిస్తాన్ ప్రభుత్వ సమాచార శాఖ నేడు ఉత్తరువులు పంపింది. అలా ముందుగా పంపిన ప్రశ్నలకు డల్లెస్ ముందుగానే జవాబులు రాసిస్తాడన్నీ, ఆపైని విలేఖరుల సమావేశంలో నోరెత్తి ఏలాంటి ప్రశ్నా అడిగేందుకు వీలులేదని హుకుం జారీ చేశారు.

ఈ పద్ధతి ఇదివరకెన్నడూ ఎరుగనిదని విలేఖరులంతా వింతగా అనుకుంటున్నారు.

వ్యతిరేక ప్రదర్శనలు

"డల్లెస్ వెనక్కిపో! క్విట్ ఆసియా! కొరియా యుద్ధం ఆపాలి!" అన్న నినాదాలతో, పాకిస్తాన్ ప్రజాతంత్ర యువజన సంఘం కరాచీ అంతటా పోస్టర్లు అంటించింది.

ఢాకా (తూర్పు పాకిస్తాన్) లో డల్లెస్ దిష్టిబొమ్మ నొకటి, ఊరేగిస్తూ తీసుకు వెళ్ళి, తగులబెట్టారు.

★ నేడే చూడండి!

ప్రకాశ్ వారి

కన్నతల్లి

జి. వరలక్ష్మి - నాగేశ్వరరావు - సింధియార్

వసంత - అడినాగేశ్వరరావు

" భావప్రకటనా స్వాతంత్ర్యం మన జన్మహక్కు. దానికి రాజ్యాంగం సంపూర్ణంగా అభయమిచ్చే వరకు విశ్రమించము "

విశాలాంధ్ర

25-5-53 సోమవారం

రాజాజీ విసుర్లు

"ఇండియాలో కమ్యూనిజం విజయశిఖరాన్ని దాటి, త్వర త్వరగా అవసాన దశవైపు దిగ జారుతోంది"

అని మద్రాసు ముఖ్యమంత్రి శ్రీమాన్ రాజగోపాలాచార్యుల వారు మలబార్ రాజకీయ మహాసభను ప్రారంభించుతూ తమ మనోభీష్టాన్ని వెల్లడిచేశారు. ప్రతిరోజూ తానుచేసిన పాపాలకు క్షమాభిక్ష వేడి, మరునాడు చేయబోయే వాటికి సాయపడమని భగవంతుని ప్రార్థించడం ఆచార్యులవారికి అలవాటని వింటున్నాము. అలాగే యిది కూడా ఆచార్యులవారి మనోవాంఛ కావచ్చుగాని వాస్తవం మాత్రం కాదు.

"ప్రజలు సుఖంగా నివసించుతున్నందుకు దేవునికి నమస్కారాలు. కమ్యూనిస్టు పత్రికలలోని ఆకలిచావు వార్తలను చదివినంతమాత్రాన తాము చనిపోతున్నామని వారు నమ్మడంలేదు," అనికూడా ఆచార్యుల వారు సంతృప్తిని వెల్లడించారు.

రాష్ట్రప్రజలు కరువు కాటకాలతో ఎలా బాధపడుతున్నారో జగమెరిగిన సత్యం. ఆచార్యులవారి డీకంట్రోలు విధానంవల్ల ఆహారధాన్యాలకు ధరలుచుక్కలంటాయి. ధాన్యం బస్తా 1కి 30/- రూ మించినందున బీదప్రజలు అన్నం కొరకు పడుతున్న కటకటను మనం నిత్యం చూస్తున్నాము.

కాని విచిత్రమేమంటే "ప్రజలు సుఖంగా నివసించుతున్నారని" ఆచార్యులవారు శెలవిస్తున్నారు. ఆకలిచావులు కేవలం కమ్యూనిస్టుపత్రికలచే కల్పించబడ్డాయంటున్నారు. నల్లద్దాలలో నుంచి చూస్తూంటే ప్రజల ఆకలిబాధలు కనిపించడం లేదు కాబోలు! ఒకసారి బీదల కొంపల్లోకి వెళ్ళి చూడండి! తామే వుద్ధరించుతామని చెబుతున్న చేనేత పనివారి కుటుంబాల దైన్యస్థితిని గమనించండి! తమ కళ్ళను ఆవరించిన తిమిరం వదలిపోయి సత్యం బయటపడుతుంది.

ప్రజల కష్టాలను, ఆకలిబాధలను గుర్తించని ఆచార్యులవారికి ప్రజలకు అండగా నిలచే కమ్యూనిస్టులపై కోపం రావడం సహజమే. అందుచేతనే శాపనార్థాలకు పూనుకున్నారు ఆచార్యులవారు.

కమ్యూనిస్టులకు "వెలుతురంటే సిగ్గట''. శాసనసభా కార్యక్రమమంటే విశ్వాసం సడలిపోయిందట. రహస్యంగా వుండటమే" మెరుగనుకుంటున్నారట. "విచ్ఛిన్న కార్యక్రమానికి పూనుకొంటే కఠినంగా అణచి వేయాలిసి" వుంటుందట.

ఇవన్నీ కేవలం అసత్యారోపణాలనడంలో సందేహం లేదు. కమ్యూనిస్టులపై అభాండాలువేసి, నిర్బంధవిధానాన్ని ప్రారంభించటానికి దురుద్దేశ్యంతో చేస్తున్న ఆరోపణాలా? అని ప్రశ్నించుచున్నాము.

శాసనసభారంగంలో కమ్యూనిస్టులు ఆచార్యులవారిని అనేక సార్లు ఓడించగలిగారు. ప్రజలపై పన్నుల భారాన్ని పెంచడానికి తెచ్చిన బిల్లులను మార్పు చేయించారు. కృష్ణానదీ జలాలను దక్షిణాదికి తరలించుకుపోయే కృష్ణా-పెన్నార్ స్కీము ను ప్రజాందోళనతో ఆపుచేయించగలిగారు. రాజాజీ పెడుతున్న ఆటంకాలను, చేస్తున్న కుట్రలను భగ్నంచేసి ఆంధ్రరాష్ట్రాన్ని సాధించుకున్నారు.

కాంగ్రెసు ప్రభుత్వ దుర్మార్గాన్ని అరికట్టడంలోనూ, ప్రజావాంఛలను ప్రతిధ్వనించడంలోనూ శాసనసభా వేదికను సద్వినియోగం చేయగలిగినందులకు కమ్యూనిస్టులు గర్వపడుతున్నారు. ప్రజలను మభ్యపరచేందుకు, స్వార్థప్రయోజనాలను నిర్విఘ్నంగా నెరవేర్చుకునేందుకు కాంగ్రెసుపార్టీకి, ఆచార్యులవారికి ఎన్నడూ కమ్యూనిస్టులు అవకాశమివ్వరు. అలాంటి ఆశలు పెట్టుకోవద్దని ఆచార్యుల వారిని హెచ్చరించుచున్నాము.

"వెలుతురు చూసి సిగ్గుపడుతున్నది" కమ్యూనిస్టులు కాదు. ఆంధ్ర జాతీయ వాంఛలను వ్యతిరేకించిన ఆచార్యులవారికే ఆంధ్ర దేశంలో కాలిడడానికి తగని సిగ్గుగా వుందనీ, అందుచేతనే విశ్వవిద్యాలయం ఇస్తానన్న బిరుదును స్వీకరించడానికి రాగల ధైర్యం లేకపోయిందనీ ఆంధ్ర ప్రజలందరికీ తెలుసు.

ఆచార్యులుగారు తమ ఉపన్యాసంలో తూర్పు యూరపు దేశాల ప్రసక్తి కూడా తెచ్చారు. ఆ దేశాలలో "పార్టీ వారు సుఖంగా వున్నారుగాని ప్రజలు ఆకలితో బాధపడుతున్నారు" అని ఆయన ఆరోపించారు. ప్రజలందరికీ తెలిసిన సంగతులను గురించే అసత్యాలు చెబుతున్న పెద్దమనిషి, దూరంగా వున్నవారిపై అభాండాలు వేయడంలో ఆశ్చర్యం లేదు.

ఐనా మద్రాసు రాష్ట్రంలో అధికారంలో వున్న కాంగ్రెసు నాయకులు తమ జేబులు నింపుకుంటున్నారనీ, ప్రజాసామాన్యం కరువుకాటకాలతో బాధపడుతున్నారనీ మనకందరకూ తెలుసు. స్వార్థానికీ, లంచగొండితనానికీ కాంగ్రెసు ప్రభుత్వం పేరుమోసింది. ఆచార్యులవారు కూడ గవర్నరు జనరలు పెన్షను నెలకు రు. 1200/- ముఖ్యమంత్రిగా జీతం నెలకు రు. 1500/- పుచ్చుకుంటున్నారు. ఇవిగాక అలవెన్సులు అదనంగా ముడుతున్నాయి. బీదదేశంలో, అన్నంకొరకు కటకటలాడుతున్న ప్రజలమధ్య నివసించుతూ యింత జీతం పుచ్చుకుంటున్న రాజాజీ, సమాధానం యివ్వడానికి అవకాశం లేని దూరదేశాలవారిని నిందించడం సిగ్గుచేటు. ఏమాత్రం ఇంగితజ్ఞానమున్నా వారికి క్షమాపణ చెప్పుకోవాలని హెచ్చరించుచున్నాము.

ఆరేళ్ళ పరిపాలనలో కాంగ్రెసు నాయకులు 60 ఏళ్ళ జాతీయోద్యమ పుణ్యాన్ని కుదువబెట్టారు. తమకు స్వార్థమే పరమార్థమని ఋజువు చేసుకున్నారు. ప్రజలలో అత్యధిక [illegible] బడుతున్నారు. అయినా అవసానదశ ఎవరికైనా దగ్గరపడిందంటే, అది కాంగ్రెసు పార్టీకేనని మనవిచేస్తున్నాము. ఈ సత్యాన్ని ఎన్నటికైనా గ్రహించక తప్పదని ఆచార్యుల వారిని హెచ్చరించుచున్నాము.

పాడిపంటలు పొంగిపొర్లే సోవియట్, చైనాదేశాలు

సోషలిస్టు ఆర్థికవిధానం, వ్యవసాయ సంస్కరణల ఫలితాలను గురించి శ్రీ ఎ. కె. గోపాలన్ వివరణ

మద్రాసు, మే 21

సోవియట్ యూనియన్, చైనా దేశాలలో కొత్త ఫ్యాక్టరీలు వెలుస్తూంటే మన దేశంలో ఉన్న ఫ్యాక్టరీలు మూసివేయబడుతున్నాయి. వేలాది కార్మికులు నిరుద్యోగులవుతున్నారు. సోషలిస్టువ్యవస్థ నిర్మాణం వ్యవసాయక సంస్కరణలవలననే ఆ దేశాల ప్రజలలో మార్పు వచ్చినది అని నిన్న పార్లమెంటరీ ప్రతిపక్షనాయకులు శ్రీ ఎ. కె. గోపాలన్‌గారు అన్నారు.

నిన్న సాయంకాలం ట్రిప్లికేన్ బీచ్ లో కమ్యూనిస్టుపార్టీ ఆధ్వర్యాన జరిగిన బహిరంగ సభలో శ్రీ గోపాలన్ ప్రసంగించారు.

స్టాలిన్ చిత్రంతోను, ఎర్రజెండాలతోను అలంకరించబడ్డ వేదికనుండి గోపాలన్‌గారు ఉపన్యసించారు. శ్రీ పి. జీవానందంగారు సభకు అధ్యక్షత వహించారు.

శ్రీ గోపాలన్ ఇలా అన్నారు:

"సోవియట్ యూనియన్, చైనా దేశాల ప్రజలకు భారతదేశంపట్ల గాఢమైన ప్రేమవుంది. మనం అక్కడకు వెళ్ళినప్పుడు అచ్చటి ప్రజలు "మీరు కమ్యూనిస్టుపార్టీ వారా? కాంగ్రెసు పార్టీ వారా?" అని ఆలోచించరు. భారతదేశం వారమని తెలిస్తే చాలు. వారు అపారమైన ప్రేమాభిమానాలతో ఆదరించుతారు"అని శ్రీ ఎ. కె. గోపాలన్‌గారు చెప్పారు.

సోవియట్ యూనియన్‌లో వుండగా కమ్యూనిస్టుపార్టీ ఆదేశాలు పొందుతూ ఆపరేషన్ అని వంకపెట్టుకున్నాడనీ, ఆపరేషన్ అంతా బూటకమనీ భారతదేశపు పత్రికలు కట్టుకథలు వ్రాశాయి. ఇటువంటి వ్రాతలు వ్రాసిన వారందరినీ నాకు ఆపరేషన్ చేసిందీ లేనిదీ నా దేహాన్ని పరీక్షచేస్తే తెలుస్తుంది. నన్ను 'లిక్విడేట్' చేసిందీ లేనిదీ నన్ను చూస్తే తెలుస్తుంది" అని గోపాలన్‌గారు పత్రికల తప్పుడు వ్రాతలకు జవాబు చెప్పారు. సోవియట్ నుండి తిరిగివస్తూ హాంకాంగు వెళ్ళాననీ, తనవెంట గెరిల్లాల నెవ్వరినీ వెంటబెట్టుకురాలేదనీ హాస్యంగా అన్నారు.

సోవియట్‌లో మత స్వాతంత్ర్యం లేదనే విమర్శలకు జవాబిస్తూ తమ పర్యటనలో అనేక చర్చిలను చూశాననీ, మసీదులలో ప్రార్థనలు చేసుకుంటున్న ముస్లిములను చూశాననీ గోపాలన్‌గారు చెప్పారు. సోవియట్‌లో ఎవ్వరికైనా సరే అతడు స్టాలిన్ అయినా, సామాన్యుడైనా సరే ఉచితవైద్యానికి అర్హుడౌతాడు అన్నారు.

సోవియట్‌లో విమర్శనా స్వాతంత్ర్యం

సోవియట్‌లో విమర్శనా స్వాతంత్ర్యం లేదనే నిందకు జవాబిస్తూ సోవియట్ డాక్టర్లను అకారణంగా అరెస్టు చేసి, తప్పుడుకేసులు పెట్టబడ్డవని తేలినప్పుడు 'ప్రవ్దా' పత్రిక అటువంటి చర్యలకు కారణభూతమైన మంత్రిని తీవ్రంగా విమర్శించుతూ సంపాదకీయం వ్రాసింది. డాక్టర్లువిడుదలచేయబడ్డారు. మంత్రిపై చర్యతీసుకోబడ్డది. మన దేశంలోనే అయినట్లయితే అటువంటి చర్యలకు కారణభూతుడైన మంత్రిపై ఎట్టి చర్యతీసుకోకుండా ప్రభుత్వం సంరక్షించి వుంచేది అన్నారు.

లెనిన్‌గ్రాడ్ మ్యూజియంలో మధుర, కోయంబత్తూరు, కాన్పూరు మొదలైన ప్రదేశాలనుంచి వచ్చిన చిత్రాలు ప్రదర్శింపబడ్డాయి. తులసీదాసు రామాయణం, హరీంద్రకవి, వల్లత్తోల్‌ల కవిత్వరచనలు లక్షల కాపీల్లో అచ్చువేయబడి అమ్ముడుపోతున్నాయి. నేనుపత్రికల్లో ప్రకటనచూసి వల్లత్తోల్ హరీంద్రకవుల రచనలకొరకు ఎన్నో పుస్తకాల షాపులు తిరిగినా అవి దొరకలేదు. అవి అంతలత్వరగా అమ్ముడుపోయాయి. నాకు వైద్యం చేస్తున్న డాక్టరు అపుస్తకాలను నాకు బహూకరించాడు. సోవియట్ యూనియన్ షాపుల్లో జనం కిటకిటలాడుతుంటారు. మన దేశంలో షాపుల ముందుగుండా వెళ్ళుతుంటే పుస్తకాలన్నీ ప్రజలను [illegible] దురుగాని రండని కేకలుపెడుతుంటారు. కాని మన ప్రజలవద్ద కొనుగోలు శక్తిలేక కొనుక్కోలేక పోతున్నారు. కాని సోవియట్ షాపుల్లో వత్తిడి ఎక్కువగావుండి చాల అవస్థపడాల్సి వస్తుంది అనిగోపాలన్‌గారు అన్నారు.

సోవియట్ ప్రజల ఆదరణ

గాంధేయ ఆర్థికవేత్త జె. సి. కుమరప్పగారు సోవియట్‌లో ఫ్యాక్టరీలను సందర్శించుతుండగా కుమరప్పగారు మన భారతీయ దుస్తులలో వున్నారు. వారికి ఫాంటు లేదని గమనించి కార్మికులు ఆయనకా చలినుంచి కాపాడుకోడానికి ఒక ఫాంటు యివ్వడానికి సిద్ధపడ్డారు. కుమరప్పగారు గాంధేయవాది అనీ, ఆయన ఫాంటు తొడుక్కోరనీ ప్రక్కనున్నవారు ఆ "కార్మికులకు చెప్పగా కార్మికులు ఇది మమ్ములను అవమానపరచడం, సరైన బట్టలు లేకుండా వుండటం మంచిదిగాదని" అన్నారు.

ప్రజల ప్రేమాభిమానాలను చూరగొనకపోతే మేడే ప్రదర్శనలల్లో సోవియట్, చైనాలలో అన్ని లక్షల ప్రజానీకాన్ని సమీకరించడం ఎటువంటి నియంతకైనా సాధ్యం కాదన్నారు.

సోవియట్‌లో ఎన్నికల పద్ధతిని వర్ణించుతూ గోపాలన్‌గారు యిలా అన్నారు. పోలింగు బూత్ వద్దకు వెళ్ళాను. అక్కడ పోలీసు హడావిడిగాని, కార్ల అట్టహాసంగానీ ఏమీ లేదు. చాల నిశ్శబ్దంగా వుంది. పోలింగ్ బూత్ మేడమీదవుంటే క్రింద ఓటర్లు డ్యాన్సులలోను, వినోదాల్లో వేడుకల్లో మునిగివున్నారు. ఇదేమి ఎన్నికలు అని ఆశ్చర్యపోయాను. ఎన్నికలు జరగడానికి ముందుగా అభ్యర్థుల నిర్ణయానికిగాను ముందు వివిధ ఫ్యాక్టరీలలోను, సంస్థలలోను ఎన్నికలు జరుగుతాయి. ఎవరికి ఎక్కువఓట్లు వస్తేవారు అభ్యర్థులుగా నిర్ణయించబడతారు.

భారతదేశంలో ప్రజాస్వామ్యం

తంజావూరుజిల్లాలో మన్నారుగుడి వద్ద ఒక గ్రామంలో ఒక ఓటరు ఐక్యసంఘటనకు ఓటు చేసినందుకుగాను స్థానిక జమీందారు ఆ ఓటరును తీసుకువెళ్ళి చేతిని చింతచెట్టుకు కట్టివేసి నరికించాడు అని నాకు వార్త చేరింది.

ఎన్ని పార్టీలుంటే అంత ప్రజాస్వామ్యమనీ, సోవియట్‌లో ఒక్క కమ్యూనిస్టుపార్టీతప్ప మరే పార్టీలేదు గాబట్టి అక్కడ ప్రజాస్వామ్యం లేదనీ చెబుతారు. మన దేశంలో చాల పార్టీలున్నవి. జరిగిందేమిటి జమిందారుకు వ్యతిరేకంగా ఓటు చేసినందుకు చేయి నరకబడింది. ఇలా చేతులు నరకబడితే వున్న ప్రజాస్వామ్యం లేకపోతే ప్రజాస్వామ్యం లేనట్లు కాదా? మన దేశంలో మాదిరిగా ఓటర్ల చేతులు నరక్కపోతే, ఓటర్లు ఎత్తుకుపోబడక పోతే సోవియటులో ప్రజాస్వామ్యం లేదని చెబుతారా? గోపాలన్‌గారు ముఖ్యమంత్రిని చేయి నరకబడ్డ ఓటరు [illegible] విచారణ జరిపించాలని కోరారు.

అమెరికన్ విదేశాంగమంత్రి డల్లెస్ ఇండియాను ప్రత్యక్షంగాగాని, పరోక్షంగాగాని అమెరికను యుద్ధవ్యూహంలోకి లాగడానికి వస్తున్నాడని డల్లెస్ పథకాలకు భారతదేశంలో స్థానంలేదని చెప్పాలని గోపాలన్ కోరారు.

గోపాలన్‌గారికి సభా ప్రారంభములో వివిధ ప్రజాసంస్థలవారు పూలదండలు వేశారు.

[illegible] గ్రామంలో [illegible] ప్రతిఘటించిన ఫలితంగా కాల్చి చంపబడిన ఆరుగురు [illegible] మృతవీరుల తరపున ఒక కాసులదండ గోపాలన్‌గారికి వేయబడింది. (వి. వి.)

బ్రిటన్, అమెరికా, ఫ్రాన్సు ప్రధానుల సమావేశం

వివిధపక్షాల హర్షం

న్యూయార్కు, మే 22

వచ్చేనెల రెండవ పక్షంలో బెర్ముడాలో బ్రిటన్, అమెరికా, ఫ్రాన్సు ప్రభుత్వ నాయకులు సమావేశంకాబోతున్నారన్న వార్త, ఐ. రా. సమితి వర్గాల్లో చాల సంతోషం కలిగించింది. దీని ఫలితంగా, రష్యాతో ఈ మూడు దేశాల సమావేశంకూడా అతి త్వరలోనే జరుగగలదనే ఆశాభావాన్ని ఈ వర్గాలు వెల్లడించాయి.

రష్యాతో సమావేశం విషయమే బెర్ముడా చర్చలలో ప్రధానాంశం కాగలదని వాషింగ్టన్‌లోని రాజకీయ వర్గాలు కూడా గట్టిగా అనుకొంటున్నారు.

పారిస్‌లో ప్రధాన మంత్రి పదవికి రాజీనామా నిచ్చిన రినీ మేయరు, "ఫ్రెంచి మంత్రివర్గం రాజీనామా సమస్యకన్నా, బెర్ముడా సమావేశం చాలా ప్రధానమైనది. నేను గాకపోతే, నాస్థానంలో వచ్చినవారు దానిలో తప్పకుండా పాల్గొంటారు"ని అన్నాడు.

"ప్రవ్దా" పత్రిక రోజుకు 35 లక్షల కాపీల అమ్మకం

శ్రీ గోపాలన్ అభిభాషణ

మద్రాసు, మే 22

"ప్రవ్దా పత్రిక రోజుకు 35 లక్షల కాపీలు అమ్ముడుపోతుంది. 35 లక్షల కాపీలను అచ్చువేయడానికి 20 నిముషాలు పడుతున్నది. ఇకముందు అచ్చువేసే కాలాన్ని 10 నిముషాలకు తగ్గించడానికి కృషి జరుగుతున్నది" అని కమ్యూనిస్టు పార్టీ నాయకుడు శ్రీ ఏ. కె. గోపాలన్ నిన్న ఇక్కడ పత్రికా విలేఖరుల గోష్టిలో తెలిపారు.

[ఈ గోష్టికి సంబంధించిన కొన్ని భాగాలను నిన్ననే ప్రకటించాము - మరికొన్ని వివరాలు నేడు ఇస్తున్నాము. —సం॥]

ఇంకా ఇలా అన్నారు:

"19వ సోవియట్ కమ్యూనిస్టు పార్టీ మహాసభకు ముందు రోజుకు రెండు పేజీలచొప్పున పార్టీ కాంగ్రెసు చర్చించాల్సిన అంశాలపై ప్రజలు వ్రాసిన లేఖలు 'ప్రవ్దా' పత్రికలో పడేవి. 'ప్రవ్దా' పత్రికలో 19వ పార్టీ కాంగ్రెసు అనంతరం రోజుకు 1500 సంపాదక లేఖలు ప్రచురించబడుతున్నవి. 'ప్రవ్దా' పత్రికలో సంపాదక లేఖలకు చాలప్రాధాన్యత యివ్వబడుతున్నది.

'ప్రవ్దా' పత్రిక కార్యాలయాన్ని నేను సందర్శించాను. కార్యాలయంలో 9 శాఖలువున్నవి. ప్రజలదగ్గరనుండివచ్చిన లేఖలను ఆ శాఖలు పరిశీలించికొన్నిటిని యథాతథంగానుమరికొన్నిటినిసంపాదకీయ వ్యాఖ్యలకు, వ్యాసరచనకు, ఉపయోగించుతారు. ప్రచురణానంతరం ప్రజల లేఖలు ఆయా మంత్రివర్గ శాఖలకు పంపబడతాయి. ప్రవ్దాపత్రికావిలేఖరులకు పలుచోట్ల కార్యాలయాలున్నవి. అక్కడ విలేఖరులు ప్రజలను కలుసుకుంటారు. సోవియట్ పత్రికలు రాయిటర్ వార్తలను, టాస్‌వార్తాసంస్థ వార్తలను ప్రచురించుతాయి."

నెహ్రూ విదేశాంగనీతి

నెహ్రూ విదేశాంగనీతిపట్ల కమ్యూనిస్టుపార్టీ వైఖరిని వివరించుతూ ఇలా అన్నారు: "కమ్యూనిస్టుపార్టీ నెహ్రూ విదేశాంగ విధానాన్నంతటినీ పూర్తిగా హర్షించడంగాని, పూర్తిగా ఖండించడంగాని చేయదు. నెహ్రూ పూర్తిగా అమెరికన్ ఏజంటు అని చెప్పం. మలయా ప్రజలపై యుద్ధం చేయడానికి బ్రిటిషువారికి గూర్ఖా సేనలను రిక్రూట్ చేసుకునే సౌకర్యం భారతదేశంలో యివ్వడం బ్రిటిషు సామ్రాజ్యవాదులకు తోడ్పడుతుందని భావించుతాం. ఐతే అగ్రరాజ్యాలు సమావేశం కావాలని నెహ్రూ చేసిన ప్రకటనను కమ్యూనిస్టుపార్టీ ఆహ్వానించింది. నెహ్రూ బ్రిటిషు రాణి పట్టాభిషేకోత్సవానికి హాజరవడంగాని, భారతదేశాన్ని కామన్వెల్త్‌లో వుంచే సిద్ధాంతాన్నిగాని కమ్యూనిస్టు పార్టీ హర్షించదు."

నిరుద్యోగాన్ని అరికట్టడానికిగాను మిల్లుయజమానులు ఫ్యాక్టరీలను మూసివేసే పద్ధతిని నిషేధించుతూ భారత ప్రభుత్వం వెంటనే ఒక చట్టం చేయాలి అని గోపాలన్ [illegible].

గోపాలన్ [illegible] కొచ్చిన్ ఎన్నికలలో ఎర్నాకులం వెళ్ళారు. తిరిగి పార్లమెంటు సమావేశం అయ్యేవరకూ, మలబార్‌లోనే వుండగలరని చెప్పారు. (వి. వి.)

ఆర్థిక పరాధీనత లేని నూతన సమాజనిర్మాణం

భారత మహిళా ఉద్యమం ముందున్న ప్రధాన కర్తవ్యాలు

ప్రపంచ మహిళా మహాసభకు భారత మహిళల సన్నాహాలు

ఢిల్లీ, మే 21

డెన్మార్కులో త్వరలో జరగబోవు ప్రపంచ మహిళా మహాసభ సన్నాహాల నిమిత్తం ఢిల్లీలో ఈ నెల రెండవవారములో జరిగిన సన్నాహక సభకు, దేశం నలుమూలలనుండి 315 మంది ప్రతినిధులు వచ్చారు. మేధావులు, గృహిణులు, రైతాంగ స్త్రీలు, మొదలైన వివిధ తరగతులకు చెందిన స్త్రీలు ఒకచోట సమావేశమై చర్చించుకోవటం బహుశా ఇదే మొదటిసారి అని చెప్పవచ్చును.

వివిధదేశాల్లోని స్త్రీలజీవితంగురించి తెలిపే పోస్టర్ల ఎగ్జిబిషన్ శ్రీమతి రామేశ్వరీ నెహ్రూ ప్రారంభించారు. ప్రతినిధులను ఆహ్వానించుతూ పార్లమెంటు సభ్యురాలు శ్రీమతి అన్నీ మేస్కరీన్, వివిధ రాజకీయ దృక్పథాలకు చెందినవారైనప్పటికి స్త్రీలందరూ ప్రపంచ శాంతిని అభిలషిస్తున్నారని ఉద్ఘాటించారు. శ్రీమతి రామేశ్వరీ నెహ్రూ రాజ్యాంగచట్టం గ్యారంటీచేసిన హక్కులు సుసంఘటిత ఉద్యమం ద్వారా సాధించుకోవాలని ఉద్బోధించారు.

కాశీ నుండి వచ్చిన ప్రఖ్యాత డాక్టరు, సంఘసేవకురాలుఅయిన శ్రీమతి తంగమ్మ ఎఫ్. ఆర్. సి. యస్. తమ అధ్యక్షోపన్యాసంలో వీట్నాం, మలయా, కొరియా, తూర్పు ఆఫ్రికాలలోని స్త్రీలు అక్కడి నిరంకుశ విధానానికి వ్యతిరేకంగాసాగించుతున్న వీరోచిత పోరాటానికి జేజేలు అర్పించారు. వలస బర్బరత్వానికి వ్యతిరేకంగా వీరు చేసే పోరాటానికి సానుభూతి అందజేయవలసిందిగా డెన్మార్కు మహాసభకు వెళ్ళే ప్రతినిధులకు డాక్టర్ తంగమ్మ విజ్ఞప్తి చేశారు.

సన్నాహక సభవారు (1) ఆహారం, పునరావాసం (2) ఉద్యోగాలు, వేతనాలు (3) స్త్రీల పిల్లల హక్కులు, వీటిపై చిత్తు ప్రణాళికలు తయారు చేశారు.

ఆహారసమస్య ముసాయిదాలో రోజురోజుకూవ్యాపించుతూన్న కరువు, తగ్గిపోతూన్న కొనుగోలుశక్తి, దారిద్ర్య కారణంగా తల్లులు ఆత్మహత్యలు చేసుకుంటున్న ఉదంతాలు మొదలైన వివరాలు పేర్కొనబడ్డాయి. భూసంబంధాలు తీవ్రంగా మార్చితేనేతప్ప ఆహార సమస్య పరిష్కారం కాదని ఇందులో స్పష్టపరచబడింది.

నిర్మాణ నిర్ణయాలు

ఈ మహాసభ సన్నాహక కమిటీయే అఖిలభారత మహిళా ఉద్యమ సమన్వయ సంఘంగా ఇకముందు కూడా పనిచేయాలని తీర్మానించబడింది. మహాసభ కన్వీనర్లే ఈ నూతన నిర్మాణానికి కార్యదర్శులుగా పనిచేయాలని నిర్ణయించబడింది. సమన్వయకసంఘంవారు తమ కార్యకలాపాలను విస్తృతపరిచి వివిధ మహిళా సంఘాలను ఒక అంగీకృత ప్రణాళికపై పనిచేయుటకు కలుసుకోవాలనీ, పరస్పర సంబంధాలు నెలకొల్పాలనీ, ఇదే ఆశయాలతో పని చేసే అంతర్జాతీయ మహిళా ఉద్యమంతో సంబంధాలు పెట్టుకొనుటకు కృషిచేయాలనీ, నిర్ణయించబడింది.

డెన్మార్కులో జరుగబోవు అంతర్జాతీయ మహిళా మహాసభకు 30 మంది ప్రతినిధులను 5 గురు ప్రేక్షకులను మహాసభ ఎన్నుకొంది.

మహాసభ ఈ దిగువ తీర్మానాలు ఏకగ్రీవంగా ఆమోదించింది.

పిల్లలసంక్షేమం - హక్కులు

పిల్లలకు విద్య, ఆరోగ్యం సుఖమైన జీవితం కలిగివుండే హక్కు వుండాలి. ప్రసూతి,ముందు, తరువాత తల్లుల ఆరోగ్యరక్షణ, ఇతర సౌకర్యాలు నేడు అత్యవసరంగా కలిగించాలి. దేశంలోని అధికసంఖ్యాక స్త్రీలకు, ఈ సౌకర్యాలులేవు. జాతికి సంపద, నేటి భావి [illegible] సంస్థలు, ఉచిత ఆరోగ్య సౌకర్యాలు విధిగా కలిగించాలి. పిల్లల రక్షణకోసం చేయబడ్డ చట్టాలు తప్పనిసరిగా అమలుజరిపేటట్లు, ఇతర దేశాల బిడ్డలకంటూ ఏవిధంగాను తీసిపోకుండా సంరక్షింపబడేటట్లు చూడాలి.

తల్లిదండ్రులకు సరైన ఉద్యోగాలేవున్నట్టయితే పిల్లలకు కడుపునిండా తిండి తప్పకఉంటుంది. ముఖ్యంగా పట్టణాల్లో పెద్ద పారిశ్రామిక నగరాల్లో, కార్మిక నివాసాలు చెప్పలేనంత ఘోరముగా వుంటున్నాయి. కార్మికుల బిడ్డలు బిచ్చగాళ్ళుగా తయారవుతున్నారు. ఈ కార్మిక ప్రాంతాలు క్రిక్కిరిసి ఉండుటచేత, అనారోగ్యకరమైన ఆహారం, నీటికొరతవలన, యీ కార్మిక నివాసాలలోని బిడ్డలు బ్రతికి బట్ట కట్టుట దుర్లభము. వీరి చదువుల సంగతి యిక చెపుడి కరుక. చివరికి ఈ పిల్లలు, బిచ్చగాళ్లుగా, నేరస్థులుగా తయారవుతారు. పిల్లలు, నోరులేని పసిపాపలు తమ సమస్యల గురించి ఆందోళన చేయలేరు కదా!

దేశంలో వేసే ఏ ప్రణాళికలైనా, పిల్లల ప్రాథమిక హక్కులను సంరక్షించకపోతే అవి తప్పక విఫలమవుతాయి. పిల్లలకు ఈ కనీస సౌకర్యాలు కల్గించినప్పుడు, పిల్లలలో పరస్పరం ప్రేమ ఆదరాభిమానాలు పెంపొందుతాయి. అజ్ఞానం తొలగిపోతుంది. కుల మత భేదాలు రూపుమాసిపోతాయి.

స్త్రీలు - శాంతి రక్షణ

ఆసియా నడిగడ్డమీద, కొరియా వీట్‌నామ్, మలయాలల్లో యుద్ధాలు జరుగుతున్నాయి. దక్షిణాఫ్రికా, కెన్యా మొదలగుచోట్ల తెల్లదొరలచే ఘోర హత్యాకాండ సాగించబడుతూంది. ఈదేశాల ప్రజలను దోచుకోడానికి, ప్రజల స్వాతంత్ర్యాలను వమ్ముచేయటాన్కి, ఆసియా దేశాలను రంగుజాతులను, బానిసత్వంలో అణచిపెట్టటాన్కి సామ్రాజ్యవాదులు ఈ యుద్ధాలు సాగిస్తున్నారు.

ఏదేశాని కాదేశం స్వతంత్రంగా ఉండడానికి, తమ కిష్టమైన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకోడానికి హక్కుందని మహాసభ విశ్వసించుతోంది. కొరియా, వీట్‌నామ్, దక్షిణాఫ్రికా, కెన్యా మొదలగు ఈ అన్ని దేశాల్లోని యుద్ధబాధితులకు ముఖ్యంగా స్త్రీలకు మహాసభ సానుభూతి తెల్పుతూంది.

కొరియా యుద్ధం వెంటనే విరమించాలని, ఇతరచోట్ల జరుగుచున్న యుద్ధాలు కూడా వెంటనే అరికట్టి, అన్నిజాతులకు స్వేచ్ఛాస్వాతంత్ర్యాలను గ్యారంటీ చేయాలని మహాసభ డిమాండు చేస్తున్నది.

స్త్రీల హక్కులు

భారత రాజ్యాంగ చట్టంలో పొందుపరచబడిన స్త్రీల హక్కులు సాధించుటకై, స్త్రీ పురుష వివక్షత లేకుండా పౌరులందరికి రాజకీయ,ఆర్థిక, సాంఘిక హక్కులు అమలు జరపాలని మహాసభ కోరుతోంది.

(1) స్త్రీలకు ఆర్థిక స్వాతంత్ర్య సాధన నిమిత్తం ఏదో ఒక ఉద్యోగం కల్పించేహక్కు. (2)వారసత్వహక్కు, భూమిపైహక్కు (3)సమానపనికి సమాన వేతనం (4) తమపిల్లలకు ఉచిత నిర్బంధ విద్య (5) వయోజనవిద్య (6) వివాహ స్వాతంత్ర్యము, ప్రసూతి సౌకర్యాలు (7) వరకట్నాలు, పరదాపద్ధతి రద్దు (8) స్త్రీలలో వ్యభిచారం నిర్మూలించే చట్టాలకు అమలు [illegible].

పురుషులతో సమాన హక్కులు

భారతదేశంలోని స్త్రీల దుర్భర పరిస్థితులు గురించి మహాసభ ప్రత్యేక దృష్టితో తీసుకుంటోంది. ఉన్నత వర్గాలలోని ఏ కొద్దిమంది స్త్రీలో తప్ప మన సమాజంలోని అధిక సంఖ్యాక స్త్రీలు ఫ్యూడల్ కుటుంబ నిర్మాణం, ఫ్యూడల్ సమాజం, రాజ్యాంగాలక్రింద బానిసల క్రింద బానిసలుగా బ్రతుకుతున్నారు. పురుషులతో బాటు సమానహక్కులు ముఖ్యంగా వున్నవి. అన్ని రంగాల్లోను పురుషులతో సమానంగా హక్కులు, బాధ్యతలు సాధించబడితేతప్ప, ఏ దేశంలోనూ రాజకీయ, ఆర్థిక, సాంఘిక, పురోభివృద్ధి సాధ్యంకాదు.

ఈ స్త్రీల హక్కులకోసం భారతదేశంలోని [illegible] సోదరులంతా, పోరాడాలి. జాతి, మత, కుల విభేదాలు రాజకీయ విభేదాలతో నిమిత్తంలేకుండా అందరూకలిసి, ఇందుకోసం విశాలమైన వుద్యమం నిర్మించాలని, సంఘంచేత ప్రభుత్వంచేత మన హక్కులు గుర్తించబడేటట్లు చేయాలని మహాసభ అభిప్రాయపడుతోంది.

1953 మే 25 సోమవారం
విజయ సంవత్సర
వైశాఖ శుద్ధ
ద్వాదశి రా. 7-21
చిత్త రా. 11-27

సింధులో గవర్నరు పాలనకు స్వస్తి

నూతన మంత్రివర్గ స్థాపన

కరాచీ, మే 22

సింధురాష్ట్రంలో (పాకిస్థాన్‌లో) నేటితో గవర్నరుపాలన అంతమయింది. పాకిస్తాన్ మాజీ ఆహారశాఖా మంత్రి అయిన పీర్‌జాదా అబ్దుస్ సత్తార్ ముఖ్యమంత్రిగా నేడిక్కడ మంత్రివర్గం ఏర్పడి, ప్రమాణ స్వీకారం గావించింది. అబ్దుస్ సత్తార్ లోగడ డిస్మిస్‌చేయబడ్డాడు. అతనిని ముఖ్యమంత్రిగా నియమించడాన్ని తాను నిరశిస్తున్నాననీ తన పార్టీ ప్రతిపక్షంగా వ్యవహరిస్తుందనీ సింధు ముస్లిం నాయకుడు ఖుహ్రో ఒక ప్రకటన చేశాడు.

దేశ్‌ముఖ్ దంపతుల పెప్సూ ప్రయాణం

పాటియాలా, మే 22

కేంద్ర ఆర్థికమంత్రి శ్రీ చింతామణి దేశముఖ్, ఆయనభార్య ధర్మపత్ని, ప్రణాళికా సంఘ సభ్యురాలూ అయిన శ్రీమతి దుర్గాబాయి దేశముఖ్ రేపు పాటియాలాకు వస్తున్నారు. వారిక్కడ రెండు రోజులపాటు వుండి భక్రన్ ప్రాజెక్టు, వైద్యకేంద్రాలు మొదలైన వాటిని చూస్తారు.

ఎగువ అస్సాంలో వరదలు

డిబ్రుగర్, మే 22

ఎగువ అస్సాంలో, బ్రహ్మపుత్రా నది వరదలవల్ల లక్ష్మిపూర్ జిల్లాలోని డిబ్రుగర్ సబ్‌డివిజన్‌లో లావోల్, రోమోరియా, జాగ్‌డాంగ్, మొదలైన ప్రాంతాల్లో నలభై గ్రామాలకు పైగా జలమయమయాయి. 2500 కుటుంబాలు కొంపా, గోడ కోల్పోయాయి

కాశ్మీర్‌లో ప్రధాని నెహ్రూ

శ్రీనగర్, మే 23

ప్రధాన మంత్రి శ్రీ నెహ్రూ ఈ వేళ ఉదయం ఢిల్లీనుండి ఇక్కడికి విమానంలో విచ్చేశారు. ఆయనతో పాటు దేశవ్యవహారాల మంత్రి డాక్టర్ కట్జూ, ఆయన సోదరి శ్రీమతి విజయలక్ష్మి పండిట్ ఉన్నారు.

విమానాశ్రయంవద్ద శ్రీ నెహ్రూను సర్దార్-ఐ-రియాసత్ యువరాజ్ కరణసింగ్, కాశ్మీర్ ప్రధాని షేక్ అబ్దుల్లా, భారత సర్వసైన్యాధ్యక్షుడు మహారాజ్ రాజేంద్రసింగ్ జీగార్లు స్వీకరించారు.

ప్రధానినెహ్రూ తిరిగి సోమవారం నాటికి ఢిల్లీకి చేరుకుంటారు.

బాపట్ల తాలూకా మహిళా కార్యకర్తల సమావేశము

బాపట్ల, మే 20

బాపట్ల తాలూకా మహిళాసంఘ కార్యకర్తల సమావేశం వేటపాలెంలో 18 తారీకున శ్రీమతి కె. లక్ష్మీనరసమ్మ గారి అధ్యక్షతను జరిగింది. సంఘ [illegible] ఈ [illegible] కమిటీని ఎన్నుకొన్నారు. శ్రీమతులు కె. లక్ష్మీనరసమ్మ, గుంపుల మాణిక్యమ్మ, జి. సుబ్బమ్మ, సి. అన్నపూర్ణమ్మ, సి. సాజాన్. (వి. వి.)

విజయవాడ విశేషాలు

ఆర్థిక సమతా మండలి సభల ప్రారంభం

విజయవాడ, మే 24

ఆర్థిక సమతామండలి ఆధ్వర్యాన నిన్న సాయంత్రం 3 గంటలకు పటమట గ్రామంలో ఆర్థిక సమానత సభలు ప్రారంభ మయ్యాయి. యావదాంధ్ర దేశంనుండి ప్రతినిధులువచ్చారు. శాసన సభ్యులు శ్రీ వావిలాల గోపాల కృష్ణయ్య, యం. వి. సుబ్బారెడ్డిగార్లు, వార్ధానుండి ప్రభాకర్, కమలాగార్లు, పశ్చిమబెంగాలునుండి భవానీ ప్రసాద చటర్జీ, బీహార్‌నుండి దేవీదయాల్ రాం (యం. యల్. ఏ) మొదలయిన ప్రముఖులు వచ్చినవారిలో వున్నారు. హైద్రాబాద్‌నుండి 12 గురు ప్రతినిధులు వచ్చారు, మొత్తం ప్రతినిధులు 80 మంది వరకు వచ్చారు.

మండలి కార్యదర్శి శ్రీ గోపరాజు రామచంద్రరావుగారు గత మూడేండ్ల కార్యకలాపాలను సమీక్షించిన అనంతరం శ్రీ వావిలాల ప్రభృతులు ప్రసంగించారు. చర్చలు సాగుతున్నాయి. సభలు మూడు రోజులపాటు, 25 వ తేదీ వరకు జరుగుతాయి.

కనకబాపయ్య చౌదరి కాలధర్మం

కృష్ణాజిల్లా పబ్లిక్ ప్రాసిక్యూటర్ శ్రీ వీరమాచనేని కనకబాపయ్య చౌదరి మొన్నరాత్రి మద్రాసు జనరల్ ఆసుపత్రిలో కాలధర్మం చేశారు. 20 రోజులనుండి వీరు యిచ్చట చికిత్స పొందుతున్నారు. అంత్య క్రియలకు పలువురు ప్రముఖులు హాజరైనారు.

అనంతపురం జిల్లాలో చేనేతవారి నిరుద్యోగం

పరిశ్రమల మంత్రికి మెమొరాండం

ఉరవకొండ, మే 20

అనంతపురం జిల్లాలో చేనేతవారి దుస్థితిని నివారించేందుకు ప్రభుత్వం తక్షణమే తగుచర్యలు తీసికొననిచో పరిస్థితులు విషమిస్తాయని హెచ్చరిస్తూ శ్రీ టి. లక్ష్మీనారాయణరెడ్డి (యం. యల్. ఏ.-స్వతంత్ర) శ్రీ బంకా చిన్న రామప్పగారలు పరిశ్రమల మంత్రికి ఒక మెమోరాండం పంపించారు.

జిల్లాలో ముఖ్య చేనేత కేంద్రాలైన ఉరవకొండ, తాడిపత్రి, ధర్మవరం, యాడికి, బుక్కరాయసముద్రం, కృష్ణాపురం మొదలైన చోట్లనే నిరుద్యోగం వ్యాపించిందని, పెట్టుబడి పెట్టలేక సొసైటీల పరిస్థితికూడా అధ్వాన్నంగా వుందని మెమొరాండంలో తెలియజేశారు.

ప్రభుత్వ కర్తవ్యం

మద్రాసు ప్రభుత్వం వెంటనే యీ క్రింది చర్యలను తీసికొనకున్నచో పరిస్థితులు మరీ విషమించగలవని హెచ్చరించారు: ఇప్పుడు అమలులో వున్న "చేనేత రిలీఫ్ స్కీము"క్రింద మగ్గానికి నెలకు కనీసము 40 పౌనులు నూలు విధిగా సప్లయి చేయాలి. లడీ 1కి 0-6-0 కాక, 0-8-0 లు మజూరీ యివ్వాలి. మిల్లు క్లాత్ సెస్సుఫండును వినియోగించాలి. 100కి తక్కువగాకుండా, 500కు మించని మగ్గాలతో అవసరమైనన్ని క్రొత్త సొసైటీలు స్థాపించాలి. పాత కొత్త సొసైటీలన్నీ ఈ స్కీము క్రింద చేర్చివేయాలి; వీటి నిర్వాహణకు గాను రాష్ట్ర ప్రభుత్వం ఒక "ప్రావిన్షియల్ హాండులూం ఇండస్ట్రీస్ వీవర్సు కార్పొరేషను" స్థాపించి పేరుగా పెట్టుబడి పెట్టాలి. జిల్లా సెంట్రల్ బ్యాంకుల గొడవ తప్పించాలి; ఈ పని యంతా ప్రావిన్షియల్ కో-ఆపరేటివ్ సొసైటీ యాజమాన్యం క్రిందగాని, అవసరమయితే పరిశ్రమల శాఖలో ఒక సబ్ డిపార్టుమెంటుద్వారాగాని నిర్వహింపజేయాలి; చేనేత కేంద్రాల్లో వెంటనే ధాన్యం చౌకడిపోలద్వారా సప్లయి చేయాలి; గంజికేంద్రాలు తెరవాలి.

రాజమండ్రి

తెలంగాణా యోధుడు శ్రీ ఆరిరెడ్డిపై విధించబడిన మరణశిక్షను నిరసన తెలుపుతూ, [illegible] కార్మిక సంఘ కార్యవర్గం 23 వ తేదీని ఒక తీర్మానం చేసింది. ఆయనపై వున్న కేసులను రద్దు పరచుకొని, ఆయనను వెంటనే విడుదల చేయ్యాలని ఆ తీర్మానంలో కోరారు.

మేల్పాడు ఫిర్కా నుండి వలసలు

బొమ్మసముద్రం, మే 22

చిత్తూరు తాలూకా మేల్పాడు ఫిర్కా, బొమ్మసముద్రం ప్రాంతంలో గోవులకు గడ్డిలేక, కానగ ఆకులు, తాటిమట్టలు, ఈత ఆకు, బోద తింటున్నవి; నీటికి మనుష్యులతోబాటు త్రాగేందుకు నీరు దొరకడంలేదు. వలసలుపోయిన వారు పోగా, మిగిలిన హరిజన కూలీలు ఈతకాయలు, తాటి ముంజలు, దేసదారు, మునగ ఆకు, కలబందగడ్డ తింటున్నారు. కోటూరు గ్రామం నుండి 15 కుటుంబాలవారు పెంకుటిండ్లను, పూరిండ్లకు తాళాలువేసి పరాయి ప్రాంతాలైన బెంగుళూరు, కోలారు, మాండ్య, మైసూరులకు వలసవెళ్ళారు. వీరిలో 10 మంది వైశ్యులుకూడా వున్నారు. మిగిలిన కుటుంబాలవారు కూడా రేపోమాపో ప్రయాణాలు కట్టనున్నారు.

డల్లెస్ వ్యతిరేక ప్రదర్శనం

బూతుల ప్రభుత్వపు కంగారు

హైద్రాబాదు, మే 21

నిన్నటి రోజున అమెరికా విదేశాంగ మంత్రి డల్లెస్ ఇండియా రాకను నిరసిస్తూ హైద్రాబాద్ సిటీ కమ్యూనిస్టు పార్టీ నాయకత్వాన పెద్ద ప్రదర్శనం జరిగింది. ప్రదర్శకులు అమెరికన్ ఇన్ఫర్మేషన్ లైబ్రరీవద్దకు వెళ్ళకుండా పోలీసులు మొజాం జాహీ మార్కెట్ వద్దనే ఆపివేశారు.

మంగళగిరి

మంగళగిరి పంచాయితీబోర్డు పనివారు 20 వ తేదీన సమావేశమై సంఘాన్ని స్థాపించుకొన్నారు. కనీస హక్కులు తీర్చవలసిందిగా యజమానులకు విజ్ఞప్తి చేశారు.

నాంపల్లి

20 వ తేదీ రాత్రి నాంపల్లి, మల్లేపల్లి బస్తీలలో (హైద్రాబాద్) నిర్బంధ వ్యతిరేక దినోత్సవాల సందర్భంలో వీధి మొగలలో సమావేశాలు జరపబడినాయి.

తెలంగాణా

రజాకార్ల నెదిర్చిన కేసులలో శిక్షితులు

కాంగ్రెస్ ప్రభుత్వం విడుదలచేయ నిరాకరణ

మానుకోట, మే 20

రజాకార్లను ఎదిరించి తెలంగాణా పోరాటాన్ని నడిపినందుకై పోలీసు చర్యల ప్రారంభ దినాలలో అరెస్టు చేసిన శ్రీ పిప్పళ్ళ వెంకట్రామయ్య, షేక్ అబ్దుల్లా, ముకుందరావు, మేకల నరసయ్య, కోడి పిచ్చయ్యగార్లు తీవ్రమైన అనారోగ్యంతో బాధపడుతున్నా ప్రభుత్వం వారిని విడుదలచేయ నిరాకరిస్తూంది.

వీరిలో ముగ్గురు మరీ ప్రాణాపాయ స్థితిలో వున్నారని డాక్టర్లు తెలుపుతున్నారు. శ్రీ మేకల నరసయ్యగారికి పోలీసు హింసలలో వీపు నరములు తెగిపోయినాయి. వారి పుపుకు రక్తం కక్కుకుంటున్నారు. వీరు ఎర్రగడ్డ హాస్పిటలులోవున్నా కేసుల కోసం తిప్పుతున్నారు.

శ్రీ షేక్ అబ్దుల్లా హృద్రోగంతో ప్రమాదస్థితిలో వున్నారు. పోలీసుల దెబ్బలవలన వీరిఊపిరితిత్తులు, గుండె బలహీనపడి పోయినాయి. ఇతరులు కూడ చాల ప్రమాదకరస్థితిలోనే వున్నారు.

ఈ అయిదుగురినీ పోలీసు చర్యల ప్రారంభదినాలలో అరెస్టుచేసి రజాకార్లను ఎదిరించి, పోరాటాలలో చంపినారని కాంగ్రెసు స్పెషల్ కోర్టులు ఉరిశిక్షలు విధించాయి. ప్రజాందోళన ఫలితంగా ఆ శిక్షలు యావజ్జీవశిక్షలుగా మార్చబడినాయి.

ఆ తీర్పు సరిఅయినది కాదని కేసు పునర్విచారణకు తెచ్చారు.

శ్రీ కొణతం వెంటయ్య

మానుకోట మేజస్ట్రేటు కోర్టు 13 వ తేదీన శ్రీ కొణతం వెంటయ్యగారిని పూచీకత్తు తీసుకొని వదలిపెట్టారు.

వీరిపై పోలీసులు 8 నెలల నుంచి బలవంతంగా చందాలు వసూలు చేశారనీ, పాలేర్లను హెచ్చుజీతాల కొరకై సమ్మె చేయించారనీ జామీను కేసు నడుపుతున్నారు.

సిమెంటు ఫ్యాక్టరీ కార్మికుల తొలగింపు

శ్రీ సత్యనారాయణరెడ్డి అసమ్మతి

హైద్రాబాద్, మే 20

షాబాద్ సిమెంటు ఫ్యాక్టరీ యజమానులు సిమెంటు కార్మికసంఘ కార్యదర్శి శ్రీ పి. గోపాలస్వామిని, మరి ఎనిమిదిమంది కార్మికులనూ పనులనుంచి తొలగించారు. ఈ విధంగా యూనియను కార్యకర్తలపై యజమానులుచేసే దాడిని కార్మికులు ప్రతిఘటించి తీరుతారనీ, ప్రభుత్వం వెంటనే కలగచేసుకొని, కార్మికుల న్యాయసమ్మత కోర్కెలకు యజమానులను ఒప్పించకపోతే సమ్మె చేయవలసిన స్థితి ఏర్పడగలదనీ కార్మిక సంఘాధ్యక్షులు శ్రీ సత్యనారాయణరెడ్డి ఒక ప్రకటన చేస్తున్నారు.

శ్రీ గాజుల రామయ్య గారిపై ఖూనీ కేసు?

మానుకోట, మే 17

ఈ నెల 13 వ తేదీన మానుకోట తాలూకా కేసముద్రానికి చెందిన శ్రీ గాజుల రామయ్యగారిని పోలీసులు అరెస్టుచేశారు. వీరిపై పోలీసులు ఒక ఖూనీకేసు పెడుతున్నారని తెలుస్తూంది.

బడ్జెటు సమావేశంలో హోంమంత్రి శ్రీ బిందూ కేసులులేవని ప్రకటించిన వారిలో శ్రీ రామయ్యగారొకరు. ఆ ప్రకటన అనంతరం వీరు తమ ఏడేండ్ల అజ్ఞాతవాసాన్ని విడిచి పోలీసుస్టేషనుకు హాజరయ్యారు. వారిని అధికారులు జామీనుపై విడుదల చేశారు.

ఇప్పుడు మరల వీరో దొంగ కేసులలో ఇరికించేటందుకై పోలీసులు అరెస్టు చేశారు.

కరువు పనులకై ప్రజాందోళన

పర్కాల తాశీల్దారువద్దకు యాత్ర

పర్కాల, మే 21

పర్కాల హరిజనులు 400 మంది తాలూకాలోని ఆహార కొరతను వివరిస్తూ, కరువు పనులను వెంటనేప్రారంభించాలనీ, చౌకడిపోలను తెరవాలనీ కోరుతూ తహశీల్దారువద్దకు ఊరేగింపు నడిపారు. రైతుసంఘాధ్యక్షులు శ్రీ కె. ఎన్. రెడ్డి ప్రజల స్థితిగతులను వివరించడంతో కుటుంబానికి రూపాయి జొన్నలు చొప్పున తాశీల్దారు ఇప్పించారు.

ఏలూరు ఫ్యాక్టరీ వర్కర్సు విజయం

ఏలూరు, మే 20

ఏలూరు ఫ్యాక్టరీ కార్మికులు తమ సంఘాన్ని పునర్నిర్మించుకొని కనీస కోర్కెల కోసం ఆందోళన చేస్తూ నెల రోజుల క్రితం పట్టణంలోని మిల్లు యజమానులందరికి యూనియన్‌ద్వారా తమకనీస కోర్కెల మెమోరాండాన్ని యిచ్చారు. మిల్లు యజమానులు సమాధానం యీయ యివ్వనందున 15 రోజుల సమ్మె నోటీసు యిచ్చారు. దానితో కొందరు షాహుకార్లు యూనియన్‌తో రాయబారాలు సాగించారు. శ్రీ నాళం రమణయ్య, వంకదారు ఆంజనేయులు మొదలగు షాహుకార్లు ముందుకువచ్చి యూనియన్‌తో రాజీ చేసుకున్నారు. అగ్రిమెంటు ప్రకారం ఈక్రింది రేట్లు 1-6-53 నుండి అమలుకు వస్తాయి.

స్త్రీవర్కర్లకు: 40 రు. లోపు జీతం వారికి 0-5-0; 41 నుండి 50 వరకు 0-4-0; 51 నుండి ఆపై వారికి 0-3-0 పెంచబడినవి.

అడకూలీలకు: రోజు కూలి 1-0-0 నుండి 1-6-0 లకు పెంచబడింది.

పట్టుబడిదార్లకు: తొట్టికోత 100 బస్తాలకు 3-8-0 నుండి 4-0-0 లకు నేలకోత 100 బస్తాలకు 3-2-0 నుండి 3-10-0 లకు గోదాం కొట్టుటకు 100 బస్తాలకు 3-2-0 నుండి 3-10-0 లకు విస్సా కాటా(బైలు రవాణా) 4-3-0 నుండి 4-11-0 లకు ధాన్యం పట్టుబడి 1-12-0 నుండి, 2-0-0 లకు, పెంచబడినవి.

బ్రిటిష్ ఇండియాపొగాకు కంపెనీ లాకౌటు

ట్రిబ్యునల్ నియమించాలని కార్మికుల ఆందోళన

గుంటూరు, మే 22

గుంటూరులోని బ్రిటిష్ పొగాకు కంపెనీ కార్మికులు కూలీరేట్లు, సెలవులు, బోనసు మొదలైన సమస్యలపై జరిపిన రాజీ సంప్రతింపులను యజమానులు నిరాకరించినందున ప్రభుత్వం జోక్యం కల్గించుకొని ట్రిబ్యునల్ నియమించవలసిందిగా కోరుతున్నారు.

కార్మికులు మే 10 వ తేదీనుండి సమ్మె ప్రారంభిస్తామని నోటీసు యిచ్చారు. కాని మే 8 వ తేదీనజరిగిన ఒక చిన్న ఘటనను సాకుగా తీసుకుని కంపెనీని అధికార్లు మూసివేశారు. కార్మికులు సమ్మె ప్రారంభించారని కంపెనీ యజమానులుప్రచారంచేశారు. తగాదాకు బాధ్యత యావత్తు కార్మికులదే నని చెప్పటకోసమే యజమానులు తమ అక్రమ లాకౌటును-కార్మికుల సమ్మెగా చిత్రిస్తు వచ్చారు.

రాజీకి యజమానుల నిరాకరణ

14వ తేదీ మొదలు రీజినల్ ఫ్యాక్టరీ ఇనస్పెక్టరు, లేబరు ఆఫీసర్లు బి. ఐ. టి. కంపెనీ యజమానులకు, కార్మికులకు మధ్య రాజీ సంప్రదింపులు సాగించారు. కార్మిక ప్రతినిధిగా పార్లమెంటు సభ్యులు, రాష్ట్ర ట్రేడ్‌యూనియన్ అధ్యక్షులు శ్రీ కె. యల్. నరసింహం గారు సంప్రదింపులలో పాల్గొన్నారు.

కార్మికులు కోరిన కనీస కోర్కెలు అంగీకరించే ముందు మేనేజిమెంటు కొన్ని షరతులుపెట్టింది. ఆ షరతులను చూస్తే కంపెనీ యజమానులు నిజంగా రాజీకి సుముఖంగా ఉన్నారో లేదో స్పష్టపడిపోతుంది. ఆ షరతులివి:

(1) కార్మిక సంఘం ప్రకటించిన అన్ని కరపత్రాలు ఎట్టి మినహాయింపులులేకుండా వుపసంహరించుకోవాలి. (2) ప్రస్తుతం కార్మిక సంఘంలోవున్న అధ్యక్ష, కార్యదర్శులను తొలగించాలి. కార్మికులుకాని వారిని కార్మికులు తమ యూనియన్ నాయకులుగా ఎన్నుకోగూడదు. (3) మే 8 తేదీన జరిగిన సంఘటనకు కార్మికసంఘ ప్రతినిధులు వ్రాతమూలంగా క్షమాపణ ఇవ్వాలి.

16, 17 తేదీలలో జరిగిన సంభాషణలలో శ్రీ కె. యల్. నరసింహంగారు కార్మికుల అభిప్రాయాలను స్పష్టంచేస్తూ ఫ్యాక్టరీ ఇన్‌స్పెక్టరుగారికి ఈ విధంగా తెలియజేసారు. (1) కార్మికసంఘానికి కరపత్రాలు అచ్చువేసేస్వాతంత్ర్యంవుంది. ఆకరపత్రాలలో కార్మికసంఘ అభిప్రాయాలు తెలియజేయబడినవి, వుపసంహరించవలసిన అవసరంలేదు. (2) కార్మికులు తమ నాయకులను ఎన్నుకునే హక్కును వదులుకోరు. (3) మే 8 తేదీని కంపెనీ లాకవుటు జేయటానికి మేనేజిమెంటు ఒక కుట్ర జేసింది. కాని కార్మికులపై నేరం మోపటానికి ప్రయత్నిస్తూ, క్షమాపణ కోరుతున్నారు. కార్మికులు క్షమాపణ ఇవ్వరు. ఆ సంఘటన విషయంలో బహిరంగ విచారణ జేయాలని కోరుతాను.

ఈ సమాధానం విన్న తర్వాత మేనేజిమెంటు తరఫున శ్రీ మూర్తిగారు 18 వ తేదీ సోమవారం నాటికి ఇతర కోర్కెల విషయంలో చర్చిస్తామని అన్నారు. కార్మిక ప్రతినిధులు అంగీకరించారు. కాని ఆ తర్వాత రాజీ సంప్రతింపులను నిరాకరించారు.

లండన్‌తో సంప్రతింపులు

రాజీ సంప్రతింపులు నిరాకరించే ముందు బి. ఐ. టి. కంపెనీ అధికారులు ఇంగ్లండులో ఉన్న కంపెనీ మేనేజమెంటుతో టెలిగ్రాములమీద, టెలిఫోనుమీద సంప్రతింపులు నడిపారు. విదేశీ పెట్టుబడిదారులు భారత కార్మికుల శ్రమను దోచుకొనడానికి అలవాటు పడ్డారు; గాని వారి న్యాయమైన కోర్కెలను అంగీకరించటానికి అలవాటుపడలేదనేది లోకవిదితమే. గుంటూరులోని కార్మికుల కోర్కెలు అంగీకరిస్తే ఆంధ్రదేశంలోఉన్న మిగిలిన బ్రాంచీలలోని కార్మికులకుకూడా అనేక సౌకర్యాలు యివ్వవలసివస్తుందని, అందుచేత గుంటూరులోని కార్మికుల కోర్కెలు నిరాకరించాలని ఇంగ్లండు నుండి ఆజ్ఞలు వచ్చినట్లు యూహించ తెలుస్తున్నది.

దీనికితోడు విజయవాడనుండివచ్చిన కాంగ్రెసు నాయకుడు కాశేశ్వరరావు, స్థానిక కాంగ్రెసువారు కంపెనీఅధికారులను కలుసుకొని వత్తాసు యిచ్చారు. బ్రిటిష్‌పెట్టుబడిదారులను బలపరచుటకు తయారైనారు.

దొంగకూలీలతో పని చేయించుటకు యత్నం

బి. ఐ. టి కంపెనీ యజమానులు ఒకవైపున ఫ్యాక్టరీని మూసి యుంచి, రెండవవైపున అందులోనున్న పొగాకు తీసుకుని వేరే చోట దొంగ కూలీలతో పని చేయించుటకు తయారయ్యారు. ఈ అక్రమాన్ని కార్మికులు శాంతి యుతమైన పికెటింగ్ ద్వారా ఎదుర్కొంటు వచ్చారు. కార్మికులు దౌర్జన్యానికి పూనుకోబట్టి కంపెనీ మూసివేశామని మేనేజిమెంటు ప్రకటించటం మోసం తప్ప వేరుకాదు. కార్మికులకు శాంతియుతంగా పికెటింగు చేసుకునే హక్కు అందరూ అంగీకరించినదే.

ట్రిబ్యునల్ నియమించాలని కార్మికుల డిమాండు

కంపెనీ ఉద్దేశపూర్వకంగా రాజీ సంప్రదింపులను నిరాకరించింది. రాజీ సంప్రతింపులు విఫలమైనవని ఫ్యాక్టరీ ఇనస్పెక్టర్ ప్రభుత్వానికి రిపోర్టు పంపారు. పర్యవసానంగా ప్రభుత్వం ఈ తగాయిదాలో జోక్యం కలుగజేసుకోవలసిందని ట్రిబ్యునల్ నియమించాలని యూనియన్ కోరింది.

శ్రీ కె. యల్. నరసింహం ప్రకటన

ఈ సందర్భంలోనే శ్రీ కె. ఎల్. నరసింహంగారు ఒక ప్రకటనచేస్తూ, గుంటూరు బి. ఐ. టి. కంపెనీలో జరుగుచున్నది యజమానులు చేసిన లాకౌటుగాని, కార్మికుల సమ్మెగాదనీ, కార్మికులు రాజీకి సంసిద్ధంగా ఉన్నారని అందుచేత ప్రభుత్వం వెంటనే జోక్యం కల్గించుకొని ట్రిబ్యునల్ నియమించాలని కోరారు.

పొగాకు కార్మికుల కష్టనష్టాలను పరిశీలించుటకు ప్రభుత్వం వెంటనే ఒక ఎంక్వయిరీ కమిటీనికూడా ఏర్పాటు చేయవలసిందిగా కోరారు. (వి. వి.)

చంద్రగిరిలో పురావస్తు ప్రదర్శనశాల

స్థాపనకు ప్రభుత్వ సమ్మతి

మద్రాసు, మే 22

చంద్రగిరిలోని రాజమహల్‌లో పురాతత్వవస్తు ప్రదర్శనశాలను నెలకొల్పాలనే సూచనను మద్రాసు ప్రభుత్వం ఆమోదించినట్లు తెలుస్తున్నది. ఈ విషయంలో పురాతత్వవస్తుశాఖకు పూర్తిసహకారాన్ని కూడా ప్రభుత్వం వాగ్దానం చేసిందట.

ఈ సందర్భంలో పరిసర జిల్లాలలో చెల్లాచెదురుగాపడివున్న శిలాశిల్పాలను ఇతర పురాతన వస్తువులను రాజమహలుకు చేర్చడానికి చర్యలు తీసుకోబడుతున్నవి. తిరుమల తిరుపతి దేవస్థానం వారుకూడా తమ సహాయాన్ని వాగ్దానం చేసినట్లు తెలుస్తున్నది. తమ స్వాధీనంలోనున్న కొన్ని శిలాశిల్పాలను, తామ్ర శాసనాలను ఇతర కళాఖండాలను అందజేస్తామని చెప్పారట.

భూదాన ఉద్యమం పట్ల మీరాబెన్ విముఖత

న్యూఢిల్లీ, మే 23

ఆచార్య వినోబా సాగించుచున్న భూదాన ఉద్యమం మన సమస్యను ఏవిధంగానూ పరిష్కరించలేదని గాంధీ ముఖ్యశిష్యుల్లో ఒకరయిన శ్రీమతి మీరాబెన్ 'హిందూస్థాన్ టైమ్సు' పత్రికలో ఒక వ్యాసాన్ని ప్రకటించింది.

ఆ వ్యాసంలో భూదాన ఉద్యమం పట్ల చాలరోజులుగా తాను విముఖతను కలిగివున్నప్పటికీ బహిరంగంగాచెప్పడం లేదనీ, మిత్రుల వొత్తిడి కలననేడు బహిరంగంగా చెప్పవలసివచ్చిందని ఆమె తెలియజేశారు.

డాక్టర్ ఎల్లాప్రగడ సుబ్బారావు స్మృతిచిహ్నం

బల్సార్‌వద్ద ఆరోమైసిన్ ఫ్యాక్టరీ స్థాపన

బల్సార్, మే 23

అమెరికాలో మరణించిన సుప్రసిద్ధ ఆంధ్ర శాస్త్రవేత్త డాక్టర్ ఎల్లాప్రగడ సుబ్బారావుగారి స్మృతిచిహ్నంగా ఇక్కడ నిర్మించబడిన ఫార్మస్యూటికల్ ఫ్యాక్టరీకి ఈవేళ ఇండియాలోని అమెరికన్ రాయబారి జార్జి అలెన్ ప్రారంభోత్సవం జరిపారు. 50 లక్షలు ఖర్చుయిన ఈ ఫ్యాక్టరీని అమెరికాలోని లాడర్‌లై లేబరేటరీ వారు నిర్మించారు.

డాక్టర్ సుబ్బారావుగారి బొమ్మగల శిలా ఫలకాన్ని ఈ సందర్భంలో ఆయన తల్లి ఆవిష్కరించారు.

డాక్టర్ సుబ్బారావుగారు కాకినాడలో జన్మించి, మద్రాసు యూనివర్సిటీలో వైద్య విద్య పట్టంపొందారు అటుతర్వాత ఇంగ్లాండులోనూ, అమెరికాలోనూ పని చేశారు. అమెరికాలో లాడర్‌లై రిసెర్చి లేబరేటరీలో పని చేస్తూ, సర్ఫోమైసిన్‌ను, ఫోలిక్ ఆసిడ్‌ను కనిపెట్టారు.

నేడు తెరవబడిన ఈ ఫ్యాక్టరీ బల్సార్‌కు 7 మైళ్ళలోవుంది. ఈ ఫ్యాక్టరీ దినానికి 10 లక్షలు ఆరోమైసిన్ మాత్రలు తయారు చేయగలదు. ఇలాంటి ఫ్యాక్టరీ ఇప్పటివరకు ఇండియాలోలేదు.

పోస్టల్ పనివారిపై అధికారుల జులుం

బొంబాయి సభలో నిరసన

బొంబాయి, మే 22

తమను అధికారులు అవమానించినందుకు నిరసనగా 300 మంది బొంబాయి పోస్టు పనివారు నేడు ఊరేగింపు, సభ జరిపారు.

ఒక పోస్టు బంట్రోతు కొలాబా ప్రాంతంలోని ఒక స్త్రీకి రిజిస్టర్ కవరు అందజేశాడట. అందులో ఉండవలసిన 50 రూపాయలు కనబడటంలేదని ఆమె ఫిర్యాదు చేసిందట. అందుమీదట పోస్టల్‌శాఖ అధికారి ఒకడు ఆ పోస్టు బంట్రోతును ఒక పోలీస్ స్టేషన్‌కు తీసుకువెళ్ళి, కొంత సేపు ఉంచి వదలివేశారట.

ఈ సందర్భంలో పోస్టల్ పనివారు జరిపిన సభలో అధికారుల అన్యాయ ప్రవర్తననునిరసించుతూతీర్మానించారు.

భారత విద్యార్థుల చైనా పర్యటన

జూన్ 6 నుండి 6 వారాలు

కలకత్తా, మే 23

భారతదేశంలో వివిధ విశ్వవిద్యాలయాలకు చెందిన 25 మంది విద్యార్థులు జూన్ 6 వ తేదీన చైనా పర్యటనకు బయలుదేరుతారని తెలుస్తున్నది. అఖిల చైనా విద్యార్థి ఫెడరేషన్, పెకింగ్ యూనివర్సిటీ విద్యార్థియూనియన్‌ల ఆహ్వానంపై వీరు వెడుతున్నారు. వీరు చైనాలో 6 వారాలపాటు వుంటారు.

కలకత్తానుంచి వెడుతున్న ఇద్దరు విద్యార్థులు శ్రీ హెచ్. పి. బాసు (యన్. ఆర్. సర్కార్ మెడికల్ కాలేజీ విద్యార్థి యూనియన్ అధ్యక్షుడు), శ్రీ వీరేంద్రపారుక్ (కలకత్తా విశ్వవిద్యాలయ విద్యార్థి యూనియన్ కార్యదర్శి) తమ పర్యటన ఉద్దేశ్యాలను వివరిస్తూ, సాంస్కృతిక సంబంధాల అభివృద్ధికోసం తాము చైనా వెడుతున్నామన్నారు. ఇందువలన ఇండియా చైనాలమధ్య మైత్రి సంబంధాలు పెంపొందుతాయన్నారు. పెకింగ్‌లో ఆసియా విద్యార్థులకు 100 మంచాలతో శానిటోరియం నెలకొల్పేందుకు చైనా విద్యార్థులు చేస్తున్న కృషిపట్ల తమకు ప్రత్యేక శ్రద్ధకలదన్నారు.

పంచాయితీ ఎన్నికలు

పలుతావులలో ప్రజా ప్రతినిధుల అఖండ విజయాలు

అవనిగడ్డ, మే 22

కృష్ణాజిల్లా దివితాలూకా కోడూరు గ్రామ మేజరు పంచాయితీ ఎన్నికలు యీ రోజున జరిగాయి. కమ్యూనిస్టు పార్టీ అభ్యర్థి శ్రీ చల్లపల్లి శ్రీనివాసరావు అధ్యక్షులుగా అత్యధిక ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. కమ్యూనిస్టు పార్టీ అభ్యర్థులను ఓడించాలని అభివృద్ధి నిరోధకులు చేసిన కుట్రలను ప్రజలు భగ్నం చేశారు.

కొప్పుకొండ

గుంటూరుజిల్లా వినుకొండతాలూకా కొప్పుకొండ గ్రామ పంచాయితీ ఎన్నికలు యిటీవల జరిగాయి. తాలూకా కమ్యూనిస్టుపార్టీ నాయకులు శ్రీ పి. వెంకట్రామయ్య అధ్యక్షులుగా గెలుపొందారు. శ్రీ దొంతులూరి జాన్ తదితరులుసభ్యులుగా ఎన్నికఅయ్యారు.

బ్రాహ్మణపల్లి

ఇటీవల జరిగిన వినుకొండతాలూకా బ్రాహ్మణపల్లి గ్రామ పంచాయితీ ఎన్నికలలో శ్రీ భవనం పుల్లారెడ్డి అధ్యక్షులుగాను శ్రీ గాయం రామ రామచంద్రారెడ్డి తదితరులు సభ్యులుగాను ఎన్నిక అయ్యారు.

కంతేరు

గుంటూరు తాలూకా కంతేరు గ్రామపంచాయితీకి ఇటీవల ఎన్నికలు జరిగాయి. శ్రీ వెలుగోటి వ్యాలా నరసింహారెడ్డి అధ్యక్షులుగాను శ్రీ వాసిరెడ్డి రాజమహాల తదితరులు సభ్యులుగాను ఎన్నిక అయ్యారు.

[illegible]

గుంటూరుజిల్లా నర్సరావుపేట తాలూకా [illegible] గ్రామ పంచాయితీ ఎన్నికలు మే 18 న జరిగాయి. కాంగ్రెసు - రైతుసంఘప్రతినిధుల మధ్య తీవ్రమైన పోటీ జరిగింది. రైతుసంఘ ప్రతినిధి శ్రీ నల్లపాటి కోటేశ్వరరావు 507 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. శ్రీ కె. ఆనందం తదితరులు సభ్యులుగా ఎన్నిక అయ్యారు.

చల్లగుండ్ల

నరసరావుపేట తాలూకా చల్లగుండ్ల గ్రామ పంచాయితీ ఎన్నికలు మే 20 న జరిగాయి, శ్రీ మేడికొండ రామలింగారెడ్డి అధ్యక్షులుగాను, శ్రీ పసుపులేటి వెంకటేశ్వర్లు తదితరులు సభ్యులుగాను ఎన్నిక అయ్యారు.

చేజర్ల

నర్సరావుపేట తాలూకా చేజర్ల గ్రామ పంచాయితీకి శ్రీ అట్లూరి పెదవెంకటరెడ్డి అధ్యక్షులుగాను శ్రీ గ్రంధి వెంకటేశ్వర్లు తదితరులు సభ్యులుగాను ఎన్నిక అయ్యారు. పోటీలేదు.

రావిపాడు

నర్సారావుపేట తాలూకా రావిపాడు గ్రామ పంచాయితీ ఎన్నికలు మే 19 న జరిగాయి. శ్రీ శతమూరి కోటయ్య అధ్యక్షులుగాను శ్రీ కొత్తా హనుమయ్య తదితరులు సభ్యులుగాను ఎన్నిక అయ్యారు.

పెదతుమ్మిడి

కృష్ణాజిల్లా కైకలూరు తాలూకా పెదతుమ్మిడి గ్రామ పంచాయితీ ఎన్నికలు మే 22 న జరిగాయి. పోటీకి సన్నాహాలుచేసిన స్థానికపార్టీలు ఆఖరు నిమిషంలో విరమించుకొన్నారు. కమ్యూనిస్టుపార్టీ బలపరచిన అభ్యర్థులు శ్రీ అడపాల వెంకటేశ్వర్రావు అధ్యక్షులుగాను, శ్రీ నల్లమోతు రామనదాసు తదితరులు సభ్యులుగాను ఏకగ్రీవంగా ఎన్నుకోబడ్డారు.

బోయపాలెం

గుంటూరుజిల్లా రేపల్లె తాలూకా బోయపాలెం గ్రామ పంచాయితీ ఎన్నికలు యిటీవల జరిగాయి. కాంగ్రెసు-కమ్యూనిస్టు పార్టీల మధ్య తీవ్రమైన పోటీ జరిగింది. కాంగ్రెసువారులు ఎన్నో అవకతవకలు చేసి తుదకు డబ్బు విరజిమ్మి వచ్చిచెడి 30 ఓట్ల మెజారిటీతో తమ అభ్యర్థి శ్రీ యలవర్తి వెంకటేశ్వర్లుగార్ని అధ్యక్షులుగా గెలిపించారు.

కొండపల్లి

విజయవాడ తాలూకా కొండపల్లి మేజరు పంచాయితీకి మే 21 న నామినేషన్ పత్రాలు తీసుకొన్నారు. స్క్రూటినీ అనంతరం 2 వ వార్డులో శ్రీ వి. వీరాస్వామి, 5వ వార్డులో శ్రీ ముంగెం వీరయ్యగార్లు పోటీలేకుండా ఎన్నిక అయినట్లు ప్రకటించింది. వీరిద్దరు కమ్యూనిస్టుపార్టీ అభ్యర్థులే. మిగిలిన స్థానాలకు కూడా కమ్యూనిస్టుపార్టీ అభ్యర్థులను నిలబెట్టింది.

జూన్ 3 వ తేదీన ఎన్నికలు జరుగుతాయి. (వి. వి.)

రేడియో

మే 26 : మంగళవారం

విజయవాడ (357.1 మీటర్లలో)

ఉదయము : 7-0 (తె. వా); 7-15 మద్రాసు వలె; 7-30 మద్రాసు వలె; 8-0 (ఆం. వా); మధ్యాహ్నం : 1-0 మద్రాసు వలె; 1-40 (హిం. వా.); 1-50 (తె. వా); 2-0 మద్రాసు వలె; 2-10 హిందీపాఠము; 4-0 వాద్యసంగీతము; సాయంత్రం : 5-30 బి. ప్రభావతి; 5-50 తిరుపతి పొన్నారావు : వయొలిన్; 6-10 స్థానిక ప్రకటనలు, వాతావరణము; 6-15 సంగీత శిక్షణ; 6-30 గ్రామస్థుల కార్యక్రమం; 7-0 (తె. వా); 7-15 గ్రామస్థుల కార్యక్ర 7-30 గీతమంజరి; 7-45 వాద్యబృందం; 8-0 బి. ప్రభావతి; 8-30 తిరుపతి పొన్నారావు : వయొలిన్; 9-0 (ఆం. వా); 9-15 ఆంగ్లప్రసంగం; 9-30 సమాప్తి.

మద్రాసు (బి) (270.3 మీటర్లలో)

ఉదయము : 7-0 (తె. వా); 7-15 ఉదయగానము; 7-30 వారి అచ్యుత రామశాస్త్రి; మధ్యాహ్నము : 12-0 కార్మికుల కార్యక్రమము; 12-30 వెంకటరామన్; 1-0 నాటక గీతాలు; (తమిళము); 1-30(ఆం.వా);1-40 గీతమాలిక 1-50 (తె. వా): 2-0 సారంగి; 2-10 హిందీపాఠము: 2-30 లలితాదేవి మహాత్మ్యం; 4-0 పి. సుందరి కృష్ణన్; 4-30 పాశ్చాత్యసంగీతం; సాయంత్రం; 5-30 వయొలిన్; 6-15 సాయం సంగీతము; 6-30 గ్రామస్థుల కార్యక్రమము; 7-0 (తె. వా); 7-15 గ్రామస్థుల కార్యక్రమం; 7-30 చట్టం తెలియదన్నా తప్పే, ప్రసంగము, జి. సి. వెంకటసుబ్బారావు: 7-45 సావిత్రిగణేశన్; 9-15 నాటక (తమిళము); 9-30 ఎస్. కృష్ణమూర్తి; 10-0 వాద్యసంగీతం; 10-30 సమాప్తి.

హైద్రాబాదు (411.0 మీటర్లలో)

ఉదయము : 7-0 (తె. వా);7-15 టి. ఎస్. చంద్రశేఖరన్ : వేణువు; 7-40 టి. సులోచన : వీణ; 8-0 (ఆం. వా); 8-15 (హిం. వా); 8-30 గీత్; 8-45 విఠల్‌రావ్ పోత్‌దార్; 9-0 అమీర్‌సుల్తాన్ ఖ్రిజీ; మధ్యాహ్నం ; 12-30 దాద్రా, గీత్ ; 12-50 (మ.వా); 1-0 స్టాజ్ సంగీత్; 1-10 సంగీతసుధ; 1-50 (తె. వా); సాయంత్రం : 5-30 మరాఠీలో కార్యక్రమము; 6-0 గీత్; 6-10 స్థానిక ప్రకటనలు; 6-15 అప్ కాపత్ర మిలా; 6-20 విఠల్‌రావ్ పోత్‌దార్; 6-35 అమీర్‌సుల్తాన్ ఖ్రిజీ; 6-45 గ్రామసీమ, షేక్ చిన్న మౌలానా : క్లారినెట్; 7-0 (తె.వా) 7-15 గ్రామసీమ; 7-45 (క. వా); 8-0 (ఉ. వా); 8-15 ఆంగ్లప్రసంగం; 8-30 ఆప్‌కీ పసంద్; 9-0 (ఆం. వా); 9-15 కర్ణాటక వాద్యసంగీత కార్యక్రమము; 10-15 సమాప్తి;

సినిమా వార్తలు

"షంషేర్"

బాంబేటాకీస్‌వారి "షంషేర్" యీనెల 27 వ తేదీ నుండి ఆంధ్రలో నవయుగ ఫిలిమ్సువారిచే విడుదల గాబోతున్నది. హిందీ భాషలో తీయబడినది. భానుమతి, అశోక్‌కుమార్‌లు ప్రధాన పాత్రలుగా నటించినారు. కుట్రదారుడైన మంత్రిని ఎదిర్చిన వీరుని గాథ ఇది.

"ఇనస్పెక్టర్"

జూపిటర్‌వారి తెలుగు డబ్బింగ్ చిత్రం. ఈనెల 27 వ తేదీనుండి యీ చిత్రం కూడా విడుదలవుతున్నది. [illegible], అంజలి, బాలచందర్, [illegible] మొదలగువారు నటించినారు.

"దేవదాసు"

వినోదావారి "దేవదాసు" జూన్ 12 న విడుదల కానున్నట్లు తెలియుచున్నది. నాగేశ్వర్రావు, సావిత్రి ప్రధాన భూమికలుగా నటించినారు.

"వయ్యారి భామ"

అజంతావారి "వయ్యారి భామ" రెండుసార్లు సెన్సార్ జరిగింది విడుదల తేదీ యింకా నిశ్చయంగా తెలియటంలేదు. అయినా జూన్ 3 వ వారంలో రావచ్చు. ఏ. యస్. ఆర్, యస్. వరలక్ష్మి, సులోచన, నాగేశ్వరరావు, [illegible] నటించిన చిత్రం. అజంతా ఫిలిమ్సువారి [illegible]

చదవండి
వీరహనుమ
వెల : 1-0-0.

ఇంగ్లీషునే ఇంకా రాజభాషగా వుంచడం భారత జాతికి అప్రతిష్ట

పూనాలో భారత భాషాభ్యుదయ సభకు అధ్యక్షత వహిస్తూ శ్రీ కానే ఉద్ఘాటన

పూనా, మే 23

ఇంగ్లీషులాంటి విదేశీభాషను ప్రభుత్వభాషగా, ఉన్నత విద్యా బోధనభాషగా ఎల్లకాలం ఉంచడం, భారతీయులకూ, భారతదేశానికీ కూడా అప్రతిష్ట అని మహామహోపాధ్యాయ శ్రీ పి. వి. కానే నేడిక్కడ ఉద్ఘాటించారు.

నేడిక్కడ భారత భాషాభ్యుదయ మహాసభ ప్రారంభమైంది. ఈ మహాసభకు బొంబాయి విశ్వవిద్యాపీఠ పూర్వోపాధ్యక్షులు శ్రీ కానే అధ్యక్షత వహించారు.

విదేశీ భాషలో ప్రభుత్వ వ్యవహారాలను ఉన్నత విద్యాబోధనను చేసే దేశం ప్రపంచంలో మరెక్కడా లేదని శ్రీ కానే అన్నారు. అందుకని విశ్వవిద్యాలయ ప్రతినిధులు, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలూ, తదితర విద్యాభిమానులూ అంతా చేరి బోధనభాష విషయంలో ఒక నిర్ణయానికి రావలసిన అవసరం ఏర్పడింది అని మహాసభ ఆశయాన్ని వివరిస్తూ శ్రీ కానే వాకొన్నారు.

ఈ మహాసభ మూడు రోజులపాటు సమావేశమౌతుంది. ఈ సభవారి ముందున్న సమస్యలు మూడు అనేవంటే:

1. ఉన్నతవిద్య మొదలుకొని వార్తా వహనం వరకు అన్ని రంగాలలోనూ ఇంగ్లీషును తొలగించాలనే ఆశయంతో, ప్రాంతీయభాషల అభివృద్ధి.
2. కేంద్ర ప్రభుత్వ భాష ప్రాంతీయ భాషల, పరస్పర సంబంధాలు.
3. జాతీయ భాషగా కేంద్ర ప్రభుత్వ భాషాభివృద్ధి.

శ్రీ జయకర్ ప్రారంభోపన్యాసం

పూనా విశ్వవిద్యాలయ ఉపాధ్యక్షులు శ్రీ యం. ఆర్. జయకర్ మహాసభను ప్రారంభిస్తూ నేడు భారతదేశ భవిష్యత్తును రూపొందించే కార్యక్రమంలో భాషా సమస్యకు ఎంతో ప్రాధాన్యం వుందన్నారు. విశ్వవిద్యాలయాన్నీ, ఇప్పటి బోధనభాష ఇంగ్లీషు స్థానే క్రమంగా ప్రాంతీయ భాషనో లేదా జాతీయ భాషనో ప్రవేశపెట్టే సమస్యను గురించి సమగ్రంగా ఆలోచించవలసి ఉన్నదనిఆయన అన్నారు.

ఆయన ఇంకా ఇలా అన్నారు:

ఇప్పుడు ఇంగ్లీషు ప్రభుత్వభాషగా బోధన భాషగా వున్నది. దీని స్థానే దేశీయ భాషను ప్రవేశపెట్టేముందు ఎన్నో విషయాలను జాగ్రత్తగా ఆలోచించాలి. తొందరపడి జాతీయాభిమానంతో ఇంగ్లీషును తీసివేసినంత మాత్రాన సమస్య పరిష్కారం కాదు. దీని స్థానే ఏ భాషను ప్రవేశపెట్టినా అది అంతరాష్ట్రీయ అంతర్జాతీయ వార్తావహన సమస్యను, ఉన్నత విద్యాబోధన సమస్యను పరిష్కరించేదిగా వుండాలి.

ఈ మహాసభవారితో కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు సహకరిస్తున్నాయి. 11 విశ్వవిద్యాలయాలు, 23 భాషాసాహిత్య పరిషత్తుల ప్రతినిధులు, 32 గురుభాషావేత్తలు ఈ సభలో పాల్గొంటున్నారు.

సభలో పాల్గొన్న ప్రముఖులలో మద్రాసు విద్యామంత్రి శ్రీ మల్లవరపు వెంకటకృష్ణారావు, శంకరరావుదేవ్, జాదూనాధ సర్కార్, గుజరాత్ విద్యాపీఠ ఉపాధ్యక్షులు హెచ్. వి. నివాటియా, యస్. జి. సర్దేశాయ్, కాకాకలేల్కర్, డా॥ రాల్ఫ్ టర్నర్, ప్రొ. హుమాయూన్ కబీర్, డాక్టర్ సునీతికుమారఛటర్జీ, మూర్తి వెంకటేశ అయ్యంగారు, డా. రఘువీర మొదలైన వారు ముఖ్యులు.

హిందీ భవిష్యత్తు

అధ్యక్షులు శ్రీ కానే హిందీ భవిష్యత్తును గురించి మాట్లాడుతూ ఇలా అన్నారు.

హిందీని కేంద్ర రాజభాషగా నిర్ణయించడానికి అనేక కారణాలున్నాయి. హిందీని చాలా మంది మాటాడగలరు. దాన్ని నేర్చుకోనడంకూడా సులభమే. అయితే హిందీ అత్యధిక సంఖ్యాకులైన భారతీయుల భాష కానిమాట నిజమే. హిందీ సాహిత్యం బెంగాలీ తమిళ మహారాష్ట్రాది ప్రాంతీయ సాహిత్యాలంత అభివృద్ధిచెందలేదన్న మాటకూడా నిజమే. అయినప్పటికీదాన్ని రాజ్యాంగసభవారు రాజభాషగా నిర్ణయించారంటే అందుకు పార్లిప్రజాతంత్ర ప్రియత్వాన్ని మెచ్చుకోనవలసివుంది.

ఇంగ్లీషు సౌకర్యాలు

ఇంగ్లీషుకున్న సౌకర్యాలు హిందీకి లేవు. ఇంగ్లీషు సాహిత్యం అపారం. అన్ని భాషలను తనలో అంతర్లీనం చేసుకొనగలశక్తి దానిలో వుంది. ఇక హిందీ దీనికేమాత్రమూ సాటిరాదు. నిరంతర కృషి సలుపుతే ఇంకో 50 సంవత్సరాలకు కాని ప్రభుత్వ భాషగా పనికివచ్చే యోగ్యత హిందీకి కలగదు. అందుకని విద్యార్థులు ఏ.శాశాలల్లో ఎన్ని భాషలు నేర్చుకోవలసి వుంటుంది అనే విషయాన్ని యీ మహాసభవారు నిర్ణయించవలసి వున్నది.

హైస్కూళ్ళలోనూ కాలేజీలలోనూకూడా ప్రాంతీయ భాషలోనే విద్యాబోధ జరగాలని, తో [illegible] కొన్నేళ్ళు వరకూ హిందీ, ఇంగ్లీషు భాషలు నిచ్ఛికంగా కాని, నిర్బంధ ద్వితీయ భాషగా కాని నేర్చుకోవాలని చాలామందిఅంగీకరించారు. అంటే ప్రతి విద్యార్థి మూడు భాషలో అంతకన్న ఎక్కువభాషలో నేర్చుకొని తీరాలన్నమాట. పెద్దలు ఎన్ని సిద్ధాంతాలు రాద్ధాంతాలు చేసినా మన హైస్కూళ్లలో చాలామంది విద్యార్థులునాలుగు భాషల్నీ, లెక్కలు, చరిత్ర, భూగోళం సైన్సు చిత్రలేఖనం మొదలైన వాటిని చక్కగా నేర్చుకోవడం అసంభవమైన విషయం అని ఒప్పుకోక తప్పదు.

పూనా విశ్వవిద్యాలయం

పూనా విశ్వవిద్యాలయంలో అన్ని తరగతుల బోధనమూ మహారాష్ట్రంలోనే జరిపించాలని ఒక నిర్ణయం జరిగింది.అయితే దీనివల్ల విద్యార్థుల విద్యా ఫలితాలు భ్రష్టంగా తయారవకుండా వుంటాయా అని యీ సభవారు ఆలోచించవలసివున్నది. బొంబాయిలో రాజభాష ఇంగ్లీషుకాని మహారాష్ట్రంకాదు. మహారాష్ట్రం రాజభాషలలో ఒకటివిననాడు అంతర్విశ్వ విద్యాలయ సంబంధ బాంధవ్యాలను గురించి ఆలోచించవలసి వుంటుంది.

వైజ్ఞానిక పారిభాషిక పదాలను నిర్ణయించుకునే సమస్య ఒకటి వుంది. ఇది చాలా వివాదగ్రస్తమైన సమస్య. అన్ని భాషలలోనూ యీ వైజ్ఞానిక పారిభాషికాలు వాడేటప్పుడు ఒక విధమైన సామరస్యం వుండడం ఉచితం. ఈ సామరస్యాన్ని సాధించడం ఎలాగో కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు ఆలోచించి శీఘ్రనిర్ణయానికి రావలసి వున్నది.

విభిన్న ప్రాంతీయ భాషలతో జాతీయైక్యతను సాధించడం ఎలాగ అనేది మరో సమస్య. ఈ సమస్యలన్నింటినీ మహాసభవారు సాకల్యంగా చర్చించి తగునిర్ణయాలు చేస్తారని ఆశిస్తున్నాను అని శ్రీ కానే తమ ఉపన్యాసాన్ని ముగించారు.

జౌళి ఎగుమతికి ధారాళంగా అనుమతి

ఎగుమతి సలహాసంఘ సమావేశంలో మంత్రి వెల్లడి

న్యూఢిల్లీ, మే 23

ఈ సంవత్సరాంతంనుండీ [illegible] ఎగుమతులకు ప్రభుత్వం ధారాళంగా లైసెన్సులిస్తుందని వాణిజ్యమంత్రి శ్రీ టి. టి. కృష్ణమాచారి నేడు ఎగుమతి సలహా సంఘ సమావేశాన్ని ప్రారంభిస్తూ వెల్లడించారు.

ఇండియానుండి ఎగుమతులవల్లవచ్చే ఆదాయము 1952-53 లో అంతకు ముందు సంవత్సరం కన్న 159 కోట్లు తగ్గిందని ఆయన అన్నారు. ఇందులో ప్రధానంగా జనపనార ఎగుమతి ఆగడంవల్ల 140 కోట్లు టీ ఎగుమతులు ఆగడంవల్ల 7 కోట్లు రావలసిన ఆదాయం లేకుండాపోయిందన్నారు.

నిన్నటి దిగుమతి సలహాసంఘంలో వలెనే నేడు యీ దిగుమతుల సలహాసంఘంలోకూడా భారతీయవస్తువులకు ఇతరదేశాల వస్తువులకు సమానగౌరవం కావాలనేవాదం వచ్చింది.

వాణిజ్యశాఖ సంయుక్త కార్యదర్శి శ్రీ ఎల్. కె. ఝా మాట్లాడుతూ తాను ఆస్ట్రేలియా న్యూజిలాండు మున్నగు దేశాలలో తిరిగినప్పుడు అక్కడి వర్తకులు భారతీయ వర్తకుల విషయమై తనకు ఫిర్యాదులు చేశారని అన్నారు.

ఉదాహరణకు జౌళిపరిశ్రమను పేర్కొంటూ, ఈబేళ్ళలో పేర్కొన్న సంఖ్యకు ఒకొక్కప్పుడు బట్టలుతక్కువవుంటున్నాయని ఆయన పేర్కొన్నారు. జపానువారు పూర్వం ఇలాంటి మోసాలకు పేరుపొందారుకాని ఇప్పుడు వారు జాగ్రత్త పడుతున్నారని, జపాను అమ్మకం పద్ధతులు మనకన్న మిన్న అని కూడా శ్రీ ఝా వాకొన్నారు.

ఇప్పుడు భారతీయ పరిశ్రమలు జపానువారి పోటీ నెదుర్కొనవలసి వస్తోంది కాబట్టి చాలా జాగ్రతగా వుండాలని ఆయన హెచ్చరించారు.

* * *

బొంబాయిలోని భారత నౌకా కార్మికులు 21 రోజుల సమ్మె నోటీసు యివ్వడానికి నిర్ణయించింది.

రాజధానిగా విజయవాడకే ఓటివ్వమని కాంగ్రెస్ శాసన సభ్యులకు ప్రజల ఆదేశం

నూజివీడు తాలూకాలో అయిదువేల మందితో జరిగిన బహిరంగసభ తీర్మానం

నూజివీడు, మే 22

"ఆంధ్రదేశం అభివృద్ధినీ, ఆంధ్రుల అభిమతాన్ని దృష్టిలో వుంచుకొని ఆంధ్ర రాజధానిగా తెలుగుసీమకు నడిగడ్డయిన విజయవాడకే తన ఓటు యివ్వవలసిందని" నూజివీడు నియోజకవర్గంనుంచి కాంగ్రెసు శాసనసభ్యులైన శ్రీ యం. ఆర్. అప్పారావుగారిని ఆదేశిస్తూ, నిన్న రాత్రి అయిదువేల మందితో జరిగిన గోగులంపాడు బహిరంగసభ తీర్మానించింది. సభకు ఏలూరు మున్సిపల్ కౌన్సిలరు శ్రీ తాడి అప్పలస్వామిగారు అధ్యక్షత వహించారు.

శాసనసభ్యులు శ్రీ కాట్రగడ్డ రాజగోపాలరావుగారు సభలో ప్రసంగిస్తూ రాజధాని విషయంలో సముచితమైన నిర్ణయం చేసేటట్లు రాజకీయ పక్షాలను, శాసన సభ్యులను ప్రజలు ఆదేశించాలన్నారు. వక్ర బుద్ధులతో ఆంధ్రదేశానికి అపచారం తలపెట్టనున్న కాంగ్రెసు శాసన సభ్యులపై ప్రజలు ఒత్తిడి తేవాలన్నారు. విజయవాడలో రాజధాని, రాయలసీమలో హైకోర్టు ఏర్పర్చుకోడానికి యీ పదిరోజులూ ఆంధ్ర ప్రజలు ఆందోళన చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఢిల్లీలో కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యాలయంపై గూండాల దాడి

న్యూఢిల్లీ, మే 23

కొత్త ఢిల్లీ కీలింగురోడ్డులోవున్న భారత కమ్యూనిస్టుపార్టీ ప్రధాన కార్యాలయంపైన నేడు 50 మంది గూండాలు కర్రలతో దాడిచేసి,సామానును చిందరవందరగా బైటపారేశారు.

ఈ భవనంలో 7 నెలలకు పూర్వం ఈ కార్యాలయం నెలకొల్పబడింది. దీన్ని వల్లభదాసు అనే ఒక రైల్వే హోటల్ యజమాని వేలంలో కొన్నాడు. అతడు యిల్లు ఖాళీచేయవలసిందిగా నేడు తనతోపాటే నోటీసునూ, కోర్టు అధికారులను తనకు కుమ్మక్కుగా 50 మంది రౌడీలను తెచ్చి క్షణమైనా గడువు యివ్వకుండా సామానును చిందరవందర చేయించాడు.

సామానులు, కాగితాలు, పుస్తకాలు అన్నీ కలగాపులగం అవడంవల్ల వాటిని క్రమపద్ధతిలో చేర్చుకోవడానికి కొంతో కాలం పడుతుంది.

క్రాస్ రోడ్స్, హిందీపత్రిక జనయుగ్, ఉర్దూ పత్రిక నయాహిందూస్థాన్, లకు సంబంధించిన వ్యాసాలు వగైరా లన్నీ కూడా యీ పుస్తకాలు కాగితాల మధ్య పడిపోవడం వల్ల యీ పత్రికల ప్రచురణ కొంత ఆలస్యం కావచ్చును. అయినా క్రాస్రోడ్సు ఎప్పటిలాగా 16 పేజీలు గాక కనీసం 12 పేజీలతోనైనా సమయానికి తీసుకొనివచ్చే ప్రయత్నాలు సాగుతున్నాయి.

ఈ భవనపు పాతయజమాని భవనాన్ని వేలం వేస్తున్న సంగతిగాని, అది అసలు తాకట్టులో వున్న సంగతి కాని బైటికిపొక్కకుండా రహస్యంగా వుంచాడు. అతడు పదినెలల అద్దెకూడా తీసుకొని ఇటీవలనే ఎక్కడికో ఉడాయించాడు. కొత్తయజమాని నోటీసును యీరోజే స్వయంగా అందించి యీ విధంగా అఘాయిత్యానికిదిగడంచూసిన ప్రజలు ప్రభుత్వాన్ని తీవ్రంగా అసహ్యించుకుంటున్నారు. లోగడ ఒక సారి పార్లమెంటు పార్టీ కార్యాలయం లోంచికూడా యిలాగే సామాను బైట పారేసిన ప్రభుత్వం ప్రజల అసహ్యానికి పాత్రమైన విషయం. "విశాలాంధ్ర" పాఠకులకు విదితమే. (వి. వి.)

రాజధాని సమస్య

(1 వ పేజీ తరువాయి)

రాష్ట్ర రాజధానిగా నిర్ణయించుట వుచితమని, ధర్మమని, ప్రజామోదకరమని విన్నవించుకుంటున్నాను."

"రాజధాని నిర్ణయంలో పార్టీ విభేదాలు విస్మరించండి"

పశ్చిమ గోదావరిజిల్లా ఏలూరు తాలూకా పోతునూరు పంచాయితీ బోర్డు అధ్యక్షులు శ్రీ కొమ్మారెడ్డి వెంకట్రామయ్యగారు గురువ ప్రకటన చేశారు:

ఆంధ్ర రాష్ట్ర రాజధాని గురించి నాయకులలో భిన్నాభిప్రాయములు కన్పించుచున్నవి. లోక్పార్టీ నాయకులు తిరుపతిని, కాంగ్రెసు ప్రజాపార్టీ నాయకులు విశాఖపట్నాన్ని కోరుచున్నట్లు పత్రికలద్వారా తెలియుచున్నది. నీటివసతి, రాకపోకల సదుపాయములు,ఆంధ్రరాజధానిలో అన్ని ప్రాంతాలకు అందుబాటులోవుండ విజయవాడ అన్నివిధాలా తగివుంటుందని భావిస్తున్నాను.

ఈజిప్టులో భీతావహం పెంచేందుకు కుట్ర

బ్రిటిష్ కుటుంబాలు నిష్క్రమించాలన్న చర్చిల్ ప్రభుత్వపు ఉత్తరువులపై ఖండన

కెయిరో, మే 23

ఈజిప్టులో తప్పని సరిగా ఉండవలసిన అవసరం లేనివారంతా వెళ్లిపోవాలని ఇటీవల బ్రిటిష్ అధికారులు చేసిన ప్రకటననుసరించి బ్రిటిష్ పౌరులు తరలిపోవడం ప్రారంభించారు.

"బ్రిటిష్ పౌరులు భయపడవలసిన అవసరం ఏమీలేదు. వారి రక్షణకు ప్రభుత్వం పూర్తి బాధ్యత వహిస్తుంది," అని ఈజిప్టు విప్లవ సమితి (మంత్రివర్గం) ఉపాధ్యక్షుడు లెఫ్టినెంట్ కర్నల్ జమాల్ నాజర్, ఒక హామీ ప్రకటించాడు.

"ఈజిప్టులోని బ్రిటిషు పౌరులను, తదితర విదేశీయులను బెదరగొట్టి, భీతావహం పెంచేందుకే బ్రిటిషు అధికారులు ఈ చర్యకు పూనుకున్నారనేది నిర్వివాదం; ఇది బ్రిటిషు సామ్రాజ్యవాదుల కుటిలత్వపు మరొకటి కాదని ఆయన తన ప్రకటనలో ఖండించాడు.

ఈవేళ, ఈజిప్టు పత్రికలన్నీ ఈ ఖండనను ప్రతిధ్వనించాయి. అక్బర్ అల్ యూమ్ అనే పత్రిక, "చర్చిల్ నిప్పుతో చెలగాట లాడుతున్నాడు. ఈజిప్టు నుండి విదేశీపెట్టుబడులు తరలిపోయేలా చేయడానికే చర్చిల్ ప్రభుత్వం ఈ ఉత్తరువు లిచ్చింది" అని వ్యాఖ్యానించింది. ఇది చాల నీచమైన ఎత్తుగడ అని, దీనిని బట్టబయలు చేయాలనీ సూచించింది.

బ్రిటిష్ సైనికాధికారి దంబాలు

తమ శిబిరాల్లోకి చొచ్చుకురావడానికి ఈజిప్టువారు ప్రయత్నాలు చేశారంటూ,సూయజ్ కాలువప్రాంతపు బ్రిటిషు సైనిక వైమానిక దళాధిపతులు ఒక హెచ్చరిక ప్రకటించారు.

ఏమైనాసరే ఇక్కడనుంచి కదలమనే ధోరణిలో బ్రిటిషు సేనాధిపతి పలికాడు.

కొత్త మంత్రివర్గ స్థాపనకు ఫ్రాన్సులో ప్రయత్నాలు

పారిస్, మే 23

ఫ్రెంచి మంత్రివర్గం రాజీనామానిచ్చి ఈవేళ మూడవరోజు.

సోషలిస్టు నాయకుడైన గైమోలిని, కొత్తమంత్రివర్గ నిర్మాణానికి ఫ్రెంచి అధ్యక్షుడు ఆరియోల్ ఈవేళ నియోగించాడు. ఈబాధ్యతనుతాను స్వీకరించేదీ లేనిదీ రేపు చెబుతానన్నాడు మోలె.

తన పార్టీ ఏలాంటి మిశ్రమమంత్రివర్గాలలోను పాల్గొనదని మోలె లోగడ ఒక సారి ఖచ్చితంగా ప్రకటించాడు. ఇప్పటి పరిస్థితుల్లో మిశ్రమ మంత్రివర్గం తప్పమరేదీ నిలవలేదు కాబట్టి,అలాంటి మంత్రివర్గ నిర్మాణానికి అంగీకరించేలా ఆరియోల్ నచ్చచెప్పగలిగితే తప్ప మోలె ఈ బాధ్యతను నిరాకరించవచ్చునని రాజకీయ వర్గాలవారు అనుకుంటున్నారు.

ఏ కారణంచేతనైనా మోలె ఈపనికి పూనుకోనకపోతే, యుద్ధ కాలంలో ప్రధాన మంత్రిగా ఉండిన పాల్ రేనోకి ఆరియోల్ ఈ బాధ్యతను వప్పగించవచ్చునను కుంటున్నారు.

మంత్రివర్గ నిర్మాణం విషయంలో అధ్యక్షుడు ఆరియోల్ నిన్న కనీసం డజను మంది ప్రముఖులతో విడివిడిగా సంప్రదించాడు. వీరిలో యుద్ధానంతరం ప్రధాని పదవి నలంకరించిన వారు తొమ్మిదిమంది. వారెవరూ ఆ బాధ్యత తను తీసుకోడానికి నిరాకరించారు.

మొన్న రాజీనామానిచ్చిన రెనె మేయరుకి ముందు ప్రధాన మంత్రిగానూ, మేయరు మంత్రివర్గంలో రక్షణశాఖ మంత్రిగానూ ఉండిన ఆంటోన్ పినే ఒక షరతుమీద ఆ బాధ్యతను తీసుకుంటానన్నాడు. ఖర్చులు తగ్గించడం మొదలయిన విషయాల్లో తనకు ఎక్కువ అధికారాలు కావాలన్నాడు. ఇలాంటి అధికారాలను కోరినందుకే మేయర్ ప్రభుత్వం కూలిపోయింది.

ఈ మంత్రివర్గ ప్రతిష్టంభనకు ఆర్థిక సమస్యలే కారణంగా కనబడుతున్నప్పటికీ, ఇండోచైనా యుద్ధం తదితర వైదేశిక వ్యవహారాలకు కూడా దీనిలో ప్రముఖపాత్ర ఉందని రాజకీయవర్గాల వారంటున్నారు.

"రాయలసీమకు ప్రాజెక్టులు కావాలి కాని, రాజధాని కాదు"

బందరు సభలో శ్రీ నాగిరెడ్డి ప్రసంగం

బందరు, మే 23

రాయలసీమ ప్రజలు కోరుతున్నది ప్రాజెక్టులు కాని రాజధాని కాదని శాసనసభ కమ్యూనిస్టుపార్టీ నాయకుడు శ్రీ తరిమెల నాగిరెడ్డి మొన్నరాత్రి ఇక్కడ మున్సిపల్ పార్కులో జరిగిన బహిరంగసభలో ఉద్ఘాటించారు.

పట్టణ కమ్యూనిస్టుపార్టీ ఆధ్వర్యాన జరిగిన ఈ సభకు 4 వేలమంది ప్రజలు హాజరైనారు. పట్టణ కమిటీ కార్యదర్శి శ్రీ యం. శ్రీహరిరావుగారు అధ్యక్షత వహించారు.

నాగిరెడ్డిగారు మాట్లాడుతూ ఇలా అన్నారు:

"రాయలసీమలో నేడు కరువు విలయతాండవమాడుతూంది. రాష్ట్రం వస్తే పంచభక్ష్య పరమాన్నాలు వస్తాయని రాయలసీమ ప్రజలు ఆశించటం లేదు. కాని మంచినీళ్ళు వస్తాయని, కరువు కాటకాల నిర్మూలనకు ప్రాజెక్టులు నిర్మించబడుతాయని, తిండి దొరుకుతుందని ఆశిస్తున్నారు. ఆంధ్రరాష్ట్రం కావాలని వారు పోరాడారంటే అందుకే కాని రాజధాని కోసం కాదు.

ఆంధ్ర జాతీయైక్యతకు అడ్డు తగిలిన పాత శక్తులే తిరిగి నేడు కూడా పని చేస్తున్నాయి. రాయలసీమ ప్రజలకు, సర్కారు ప్రజలకు అడ్డుకట్టలు పెట్టాలని కుట్రలు పన్నుతున్నారు. వారి ఆటలు కనిపెట్టి వుండాలని మనవి చేస్తున్నాను.

సర్కారు, ఆంధ్ర తెలంగాణా ప్రజలమధ్య ఐక్యత సాధించడానికి విజయవాడ రాజధానే సరిఅయినది. విశ్వవిద్యాలయం విషయంలో లోగడ జరిగిన తప్పులను తిరిగి చెయ్యరాదు. చరిత్రనుండి పాఠాలు నేర్చుకోన తిరస్కరిస్తే ప్రజలు సహించరు.

రాజకీయంగా అంతా విజయవాడనే రాజధానిగా అంగీకరించారు. కమ్యూనిస్టుపార్టీ, కాంగ్రెసు, ప్రజాసోషలిస్టు, లోక్పార్టీల రాష్ట్ర ఆఫీసులన్నీ విజయవాడలోనే వున్నాయి. యిట్టి పరిస్థితులలో ఒకరు తిరుపతి అని, మరొకరు విశాఖ అనీ అనటంలో అర్థంలేదు. అందరికీ అందుబాటులో వున్న విజయవాడనే రాజధానిగా నిర్ణయించాలి."

అటు తర్వాత కమ్యూనిస్టుపార్టీ కార్యక్రమాన్ని వివరిస్తూ కనీస కార్యక్రమంతో ఏకీభవించే అన్నపార్టీలతో కలిసి పనిచేయుటానికి కమ్యూనిస్టుపార్టీ సిద్ధంగా వున్నదన్నారు.

మొన్న సాయంత్రం 5 గంటలకు [illegible] పురమందిరంలో ప్రముఖ న్యాయవాది శ్రీ యలమంచిలి నాగభూషణంగారి అధ్యక్షతన ఇష్టాగోష్టి సభ జరుపబడింది. సభకు 150 మంది న్యాయవాదులు, డాక్టర్లు, ఉపాధ్యాయులు మున్నగువారు విచ్చేశారు. అనేక ప్రశ్నలకు నాగిరెడ్డిగారు సమాధానం చెప్పారు.

ఆంధ్ర ఎలక్ట్రిక్ కార్మిక సంఘ నాయకులకు ప్రభుత్వ ఆహ్వానం

కార్మికుల సమస్యపై సంప్రదింపుల నిమిత్తం

విజయవాడ, మే 24

మద్రాసు రాష్ట్రంలోని ఎలక్ట్రిక్ కార్మికుల సమస్యలపై లోగడ ప్రభుత్వానికి సమర్పించిన మెమొరాండంపై సంప్రదింపులు జరుపుటకు రావలసిందిగా ఆంధ్ర పవర్ సిస్టమ్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షులు శ్రీ కె. యల్. నరసింహం ఎమ్. పి; శ్రీ జాన్ రాజు కార్యదర్శిగార్లకు మద్రాసు ప్రభుత్వ లేబర్ కమీషనర్, ఎలక్ట్రిక్ ఛీఫ్ ఇంజనీయరు ఆహ్వానం పంపారు.

రిట్రెంచిమెంటు, రివర్షన్ సీనియారిటీ, ప్రమోషన్లు, ఇంక్రిమెంట్లు మొదలైన విషయాలపై ఈ సంప్రదింపులు జరుగుతాయి.

23వ తేదీన శ్రీ కె.ఎల్. నరసింహంగారి అధ్యక్షతను విజయవాడలో జరిగిన ఆంధ్ర పవర్ సిస్టమ్ ఎంప్లాయీస్ యూనియన్ జనరల్ బాడీసమావేశంలో యూనియన్ అధ్యక్ష కార్యదర్శులకు సంప్రదింపులు నిమిత్తం అధికారం యిస్తూ తీర్మానించారు.

జులై నెలలో అన్ని బ్రాంచీల ప్రతినిధులతో విజయవాడలో మహాసభ జరుపుటకు తీర్మానించారు.

* * *

హైదరాబాద్ పోలీసు ఇనస్పెక్టర్ జనరల్గా ఉన్న శ్రీ పి. కె. మోనప్ప ఆంధ్రరాష్ట్రానికి మొదటి పోలీసు ఇనస్పెక్టర్ జనరల్గా నియమించబడవచ్చునని అభిజ్ఞవర్గాలు భావిస్తున్నాయి.

వరంగల్ కమ్యూనిస్టు ముఖ్యుల బహిరాగమనం

వెంటనే పోలీసులచే అరెస్టు

ఖమ్మంమెట్టు, మే 22

వరంగల్ జిల్లా కిసాన్ సభ అధ్యక్షుడు శ్రీ చండూరు నరసింహారావు, వరంగల్ జిల్లా కమ్యూనిస్టు కమిటీ సెక్రటేరియట్ సభ్యుడు శ్రీ తీగల సత్యనారాయణగారలు నిన్న జిల్లా కిసాన్ సభ సమావేశం జరిగిన సందర్భంలో అజ్ఞాతవాసం నుండి బహిరంగంగా వచ్చారు. వీరిలో శ్రీ నరసింహారావుగారు 4 సంవత్సరాలుగాను, సత్యనారాయణగారు 6 సంవత్సరాలుగాను రహస్య జీవితం గడుపుతున్నారు.

అయితే వీరు బహిరంగంగా రాగానే నిన్న రాత్రి బోనకల్లు రైల్వేస్టేషన్ వద్ద అరెస్టుచేయబడి ఖమ్మంమెట్టుకు తీసుకురాబడినారు. జిల్లా కమ్యూనిస్టు కమిటీ కార్యాలయానికి వెడుతుండగా వీరిని అరెస్టుచేశారు.

వీరిని అనేక తప్పుడు కేసులలో ఇరికించాలని ప్రభుత్వంతీవ్రంగా ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తున్నది. వీరిని వెంటనే విడుదల చేయాలని ఆందోళన చేయవలసిందిగా ప్రజాతంత్ర వాదులకు వరంగల్ జిల్లా కమ్యూనిస్టుకమిటీ విజ్ఞప్తి చేస్తున్నది.

పత్రికల చరిత్ర

గౌహతి, మే 23

భారతదేశంలో పత్రికలు వాటి పుట్టుపూర్వోత్తరాలను వివరిస్తూ ప్రెస్ కమీషనువారు భారత పత్రికాచరిత్రను రచించడానికి నిశ్చయించినట్లు తెలుస్తోంది.

అఖిలభారత పత్రికా సంపాదక సభ ప్రధాన కార్యదర్శి శ్రీ నటరాజన్ ప్రెస్ కమిషన్వారు ఈ పనిని పురమాయించారు. దీనికిగాను పదివేల రూపాయిలు వ్యయం కావచ్చునని అంచనా కట్టారు.

* * *

విక్టోరియారాణి కాలం నుంచి పేరు ప్రఖ్యాతిగన్న ఒక నాటకశాల గ్లాస్గోలో కాలిపోయింది.

వరినారు
మసూరి K. 19, పొట్టి
సన్నరకము నారు [illegible]
[illegible] అమ్మబడును. కావలసినవారు
త్వరపడి తీసుకోండి.
కాట్రగడ్డ
[illegible]
[illegible]పురం-విజయవాడ-2.

25—5—53

శ్రీ సరస్వతి
అల్ బేలా (హిందీ)
గీతాబాలి, భగవాన్
మూడు ఆటలు

శ్రీ మారుతి సినిమా
కన్నతల్లి
జి. వరలక్ష్మి, నాగేశ్వరరావు, వసంత
6 వ వారం రెండు ఆటలు

శ్రీ దుర్గాకళామందిరం
తండ్రి
బి. యస్. సరోజ, ప్రేమనజీర్
4 వ వారం రెండు ఆటలు

శ్రీ లీలామహల్
TEN TALL MEN
ప్రచండ ప్రళయ వీరులు
పంచరంగుల చిత్రం
మూడు ఆటలు

శేష్ మహల్
శుకరంభ
అంజలిదేవి, భారతభూషణ్
2 వ వారం మూడు ఆటలు

కొరియా చర్చలు

కొత్తసూచనతో హారిసన్ బయలుదేరుతున్నాడని ఊహ

లండన్, మే 23

కొరియాలో యుద్ధవిరమణ చర్చలు తిరిగి సోమవారం ప్రారంభమవనున్నాయి.

చర్చలలో పాల్గొంటున్న అమెరికా ప్రతినిధి వర్గ నాయకుడు జనరల్ హారిసన్ ఈవేళో రేపో కొత్తసూచనలతో టోకియోనుండి కొరియా చేరుకుంటాడని అనుకుంటున్నారు.

నామ్ ఇల్ ప్రకటన

ఈ లోగా, ఉత్తర కొరియా ప్రతినిధి వర్గ నాయకుడయిన జనరల్ నామ్ ఇల్ ఈవేళొక ప్రకటన చేస్తూ, లోగడ అమెరికా వారు చేసిన ప్రతిపాదనకు తమ పూర్తి వ్యతిరేకతను మరొకసారి నొక్కిచెప్పాడు. నామ్ ఇల్ ప్రకటనను నవచైనా వార్తా సంస్థ ప్రసారించింది.

మార్పిడికి నిరాకరించే యుద్ధ ఖైదీలను అయిదు తటస్థ దేశాల ఉపసంఘం అజమాయిషీకింద నాలుగు మాసాలు ఉంచి, వారి మనసు మార్చేందుకు తగిన అవకాశాలు కలిగించాలనీ; ఆ తరువాతకూడా మిగిలిపోయే వారి విషయం సమగ్ర రాజకీయ సమావేశంలో పరిష్కరించాలనీ తాముచేసిన ప్రతిపాదనే సమస్యా పరిష్కారానికి తగినదని ఆయన పునరుద్ఘాటించాడు.

అమెరికా వారి ప్రతిపాదన, తమ ప్రతిపాదనకు పూర్తిగా భిన్నమైనదని వివరిస్తూ నామ్ఇల్ ఇలా అన్నాడు: "యుద్ధఖైదీలను నిర్బంధంగా అట్టిపెట్టడానికిగాని, బలవంతంగావారిని స్వస్థానాలకు పంపేందుకుగాని మా ప్రతిపాదన ఎలాంటి అవకాశం ఇవ్వదు.యుద్ధఖైదీ సమస్య న్యాయంగా, సక్రమంగా పరిష్కారమయ్యేందుకు అదే మార్గం."

జూన్ 1 సమావేశం

ఏ నియమాల ననుసరించాలని పలువురి ఆశంక

మద్రాసు మే.23

ఆంధ్రరాష్ట్ర రాజధానినిర్ణయానికిగాను ఆంధ్రశాసన సభ్యులంతా జూన్ 1 వ తేదీన సమావేశమవ్వాలని స్పీకరు ఆదేశాలు పంపించారు. కాని ఈసమావేశం శాసన వ్యవహారాలను గురించి ఏర్పరచేది కాదుకాబట్టి శాసనసభా నియమ నిబంధనలు దీనికి వర్తించవు; ఏ నియమనిబంధనలను అనుసరించి వీరిప్పుడు సభా వ్యవహారాలను ఆ రోజున సాగించవలసి వుంటుంది అనే సమస్య ఇంత వరకూ తేలలేదు.


సెన్ - రాలే
ఇండియాలో
తయారుచేయబడు
ఈ సైకిల్లో
రాలే శ్రేష్ఠత
ప్రవేశపెట్టబడినది
రాబిన్ హుడ్
డిస్ట్రిబ్యూటర్లు: సెన్ & పండిట్ లిమిటెడ్
SRX 13 T6

సంపాదకుడు. ముద్రాపకుడు. ప్రచురణకర్త :— కాట్రగడ్డ రాజగోపాలరావు
ముద్రణ :— స్వతంత్ర కన్సర్న్సు లిమిటెడ్వారి స్వతంత్ర ఆర్ట్ ప్రింటర్సు:
బకింగ్ హాంపేట. విజయవాడ
సంపాదకవర్గం :— మద్దుకూరి చంద్రశేఖరరావు [అధ్యక్షుడు]
కంభంపాటి సత్యనారాయణ. కాట్రగడ్డ రాజగోపాలరావు